


Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తాతరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :154 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | బుధవారం 14 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వెల రూ5 /-

# తెలంగాణలో ఎల్‌నినో దెబ్బ..

## తీవ్ర సాగు, తాగునీటి ఎద్దడి..

## యాసంగి పంటలపై ప్రభుత్వం కీలక ప్రకటన



**ఖమ్మం:**తెలంగాణ రాష్ట్రాన్ని ఎల్ నినో గండం ముంచెత్తుతోంది. రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది. రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటితోపాటు విద్యుత్ సరఫరాపై కూడా తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతాంగం యాసంగి సాగు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను ఎలాగోలా కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని.. అయితే భవిష్యత్తులో ఎదురయ్యే తీవ్ర నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని.. ఈసారి యాసంగి పంటలు వేయకుండా రైతులు సహకరించాలని కోరారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో మంత్రులు పర్యటించారు. అనంతరం ఎల్ నినో పరిస్థితులపై చర్చించారు. రానున్న - మిగతా3లో

# జంతర్‌మంతర్ బంద్..

## డిసెంబరు 29, 30, 31 తేదీల్లోనే బుకింగ్ అవకాశం



**న్యూఢిల్లీ , అక్టోబరు 13:**ఢిల్లీలో నిరసన ప్రదర్శనలకు వేదిక మారింది. గతంలో జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహించే వారు ఇప్పుడు ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే కొత్తగా కేటాయించిన రామ్‌లీలా మైదాన్‌లో నిరసన చేపట్టాలంటే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. రోజుకు రూ.50 వేల అద్దెతో పాటు ఇతర చెల్లింపులు కలిపి తొలిరోజే రూ.1.21 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తోంది. దీనికి తోడు ఈ ఏడాదిలో డిసెంబరు 29, 30, 31 తేదీలు మినహా మైదాన్ అందుబాటులో లేదని అధికారులు చెబుతున్నారు.ఢిల్లీలోని 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రామ్‌లీలా మైదాన్‌లో సుమారు 50 వేల మంది పాల్గొనేలా కార్యక్రమాలు నిర్వహించవచ్చు. ఈ మైదాన్ బుకింగ్ కోసం రోజుకు రూ.50 వేలు చెల్లించాలి. అదనంగా రూ.55 వేల సెక్యూరిటీ డిపాజిట్ ఇవ్వాలి. ఇది తిరిగి చెల్లిస్తారు. పన్నులతో కలిపి - మిగతా3లో

# అధికారం అజమాయిషీకి కాదు..

## ప్రజలకు సాధికారత కల్పించాలి: మోదీ



**ఇంటర్నెట్ డెస్క్:** టెక్నాలజీ, డేటా, నాలెడ్జ్, ఇన్నోవేషన్ అనేవి నేటి ప్రపంచంలో అత్యంత కీలక శక్తులని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వాటిని కొందరి ప్రయోజనాలకే పరిమితం చేయకుండా.. కోట్లాది మందికి కొత్త అవకాశాలు కల్పించేందుకు ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడిన ఆయన.. పోటీకి బదులుగా సహకారం, నియంత్రణకు బదులుగా సాధికారత లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం బలమైన పునాదులపై నిలిచి ఉందని ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. దీంతో 2026-27 ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. హరిత ఇంధన రంగంలోనూ భారత్ గణనీయమైన వృద్ధిని సాధించిందన్నారు. 2014లో దేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సుమారు 75 గిగావాట్లుగా ఉండగా.. ప్రస్తుతం అది 300 గిగావాట్లకు ఎగబాకిందని చెప్పుకొచ్చారు. దీంతో స్వచ్ఛ ఇంధన రంగం కొత్త ఆర్థిక అవకాశాలకు - మిగతా3లో

# 20 ఏళ్ల పోరాటానికి ఫలితం..

## ఉపాధి హామీ ఎఫ్‌టీఈ ఉద్యోగులకు దసరా కానుక..



**హైదరాబాద్, అక్టోబర్ 13:** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం దసరా కానుక అందించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీ ప్రయోజనం కల్పిస్తూ జీవో జారీ చేసింది. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో దాదాపు 20 ఏళ్లుగా ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సర్వీసు, రిటైర్మెంట్‌కు సంబంధించిన నిబంధనల ప్రకారం కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీతో పాటు, పదేళ్ల సర్వీసు పూర్తిచేసే ఉద్యోగులకు రూ.10 లక్షల వరకు ప్రయోజనం లభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో ఆర్థిక భరోసా లభించనుంది. తమ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రి సీతక్కకు ఎఫ్‌టీఈ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. అలాగే గ్రాట్యుటీ మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ డిమాండ్ నెరవేరడం పట్ల ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలకు దశలవారీగా పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. దీర్ఘకాలం సేవలందించిన ఉద్యోగులకు జీవిత చరమాంకంలో ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రాట్యుటీ మంజూరు నిర్ణయం ఎఫ్‌టీఈ ఉద్యోగులకు ఎంతో ఊరటనివ్వనుంది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమ 20 ఏళ్ల పోరాటానికి గుర్తింపుగా నిలుస్తుందని ఉద్యోగ సంఘం ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి అమలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఉద్యోగుల్లో భరోసాను పెంచడంతో పాటు, భవిష్యత్తులో తమ కుటుంబాల ఆర్థిక భద్రతకు తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.




# దీపావళి తర్వాత యూపీఐ ఛార్జీల అమలు

**న్యూఢిల్లీ , అక్టోబరు 13:**యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే మర్చంట్ లావాదేవీలపై ప్రతిపాదిత ఎండీఆర్ ఛార్జీల అమలును వాయిదా వేస్తున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. పండగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో వ్యాపారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దీంతో వ్యాపార వర్గాలకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది.ఈ విషయంపై మంగళవారం సమావేశమైన యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ, ఈ నిర్ణయాన్ని ఖరారు చేసింది. "పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, ఎంపిక చేసిన పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను దీపావళి తర్వాత అమలు చేయాలని నిర్ణయించాం. కచ్చితమైన తేదీని త్వరలోనే ప్రకటిస్తాం" అని ఎన్‌పీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం, ఛార్జీల అమలు నవంబర్ రెండో వారం తర్వాత ఉండే అవకాశం ఉంది.గత సెప్టెంబర్‌లో యూపీఐ స్టీరింగ్ కమిటీ, రూ.2,000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించాలని నిర్ణయించింది. అంటే, వ్యాపారి ప్రతి రూ.2,000 - మిగతా3లో

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

## కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ

## వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య

## పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి



దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన - మిగతా3లో

# హైస్పీడ్ రైల్ కారిడార్ల చిచ్చు!




**హైదరాబాద్ , అక్టోబరు 13:**హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ కారిడార్ల వ్యవహారం ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ రగడకు కారణమవుతోంది. ఒకవైపు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసి, భూసేకరణకు హడావుడి చేస్తుంటే.. మరోవైపు అలైన్‌మెంట్ ఇంకా ఖరారే కాలేదని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలు కేవలం సాంకేతిక లోపాలా లేక రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న వ్యూహాలా అనే అనుమానాలకు తావిస్తున్నాయి.తెలంగాణ మీదుగా ముంబై, బెంగళూరు, చెన్నైలకు హైస్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు కోసం గతంలో రైల్వే అధికారులతో అనేక దఫాలు చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన రైల్వే అధికారులు.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని బహాదూర్‌గూడలో రైల్ హబ్ కోసం 400 ఎకరాలు - మిగతా3లో

# సింగరేణిలో 15 రోజుల్లో కారుణ్య నియామకాలు

భట్టి విక్రమార్క



**హైదరాబాద్:**సింగరేణి కార్మికులకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. కారుణ్య నియామకాలను 15 రోజుల్లో పూర్తి చేస్తామని, మారుపేర్ల సమస్యకు అదే గడువులో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఏరియా ఆస్పత్రుల్లోనే మెడికల్ ఇన్వ్యాలిడేషన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కరోనా సమయంలో విధులకు హాజరుకాక డిస్మిస్ అయిన వారికి వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి ఉద్యోగం కల్పిస్తామన్నారు. 1,250 ఎకరాల్లో అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, నెహ్రూ హౌసింగ్ కాలనీ నిర్మిస్తామని చెప్పారు. ఏరియా ఆస్పత్రులను అభివృద్ధి చేసి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

వార్తాతరంగాలు

బుధవారం 14 అక్టోబర్ 2026

# సంపాదకీయం

## రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, 2027 ముప్పు

ప్రకృతి ప్రకోపించినప్పుడు ఏ ప్రభుత్వమైనా, ఎంతటి బలమైన వ్యవస్థ అయినా ఒక్కసారిగా కుదేలవుతుంది. అందులోనూ ఎల్ నినో వంటి వాతావరణ విపత్తులు పాలకులకు నిద్రలేకుండా చేసే అత్యంత క్లిష్టమైన సవాళ్లు. భూగోళం వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ అనూహ్య వాతావరణ మార్పులు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాలను ఛిన్నాభిన్నం చేస్తాయి. నీరు అనేది లేకపోతే మానవ జీవనమే మూగబోతుంది. తాగునీరు కరవైతే జనజీవనం అస్తవ్యస్తమవుతుంది, సాగునీరు అందకపోతే అన్నదాత కన్నీరుమున్నీరవుతాడు. ఇటు తాగు, సాగు నీటి కొరత ఏర్పడితే జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా పడిపోయి కరెంట్ కోతలు మొదలవుతాయి. తద్వారా పారిశ్రామిక ఉత్పాదకత దెబ్బతిని, నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతాయి. ఇదొక దుర్భిక్షపు విషవలయం.ప్రస్తుతం దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను కమ్ముకువస్తున్న ముప్పు కేవలం సాధారణ ఎల్ నినో కాదు. అంతకంటే ఎన్నో రెట్లు భీకరమైన సూపర్ ఎల్ నినో . రుతుపవనాలు చేతులెత్తేయడంతో ఈసార వర్షపాతం అంతంతమాత్రంగానే నమోదైంది. జలాశయాలు సగం కూడా నిండని దుస్థితిలో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని వచ్చే ఏడాది జూన్ వరకు తీవ్రమైన పొదుపుతో, అత్యంత అప్రమత్తంగా వాడుకోవాల్సిన కత్తిమీద సాములాంటి పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటిపోతున్న ఈ తరుణంలో పాలకులకు ఇది మునుపెన్నడూ లేని విధంగా అగ్నిపరీక్షగా మారింది. ఈ కరవు పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో ప్రజల్లో తీవ్రమైన అసహనం, ఆగ్రహం వ్యక్తమవడం సహజం. తాగునీరు అందక, విద్యుత్ కోట్లు పెరిగి, పంటలు ఎండిపోతున్న సమయాల్లో సగటు జీవి అగ్గిమీద గుగ్గిలమౌతాడు. ఈ సహజమైన ప్రజా అసహనాన్ని, నిరాశను పాలకులపై తిరుగుబాటుగా మలచడానికి, రాజకీయ లబ్ధి పొందడానికి ప్రతిపక్షాలు ఎప్పుడూ కాచుకుని కూర్చుంటాయి. ప్రభుత్వంపై బురదజల్లేందుకు, ప్రజలను రెచ్చగొట్టేందుకు ఇదే అదనుగా భావిస్తాయి. అయితే, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటూ కేవలం పోలీసు బలంతోనో, ప్రకటనలతోనో ఈ విపత్తును నియంత్రించడం ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు.మరి ఈ పెనుముప్పు నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వాలు చేయాల్సింది ఏమిటి? ముందుగా పారదర్శకతతో కూడిన వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ఉన్న నీటి వనరులు, విద్యుత్ లభ్యతపై ప్రతి పౌరుడికి ముందస్తు అవగాహన కల్పించాలి. నీటిని, కరెంటును ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలో వివరిస్తూ ఒక ప్రజా ఉద్యమంలాంటి ప్రచారాన్ని చేపట్టాలి. ఈ సూపర్ ఎల్ నినో విపత్తును కేవలం ప్రభుత్వ సమస్యగా కాకుండా, ఇది మనందరి ఉమ్మడి సంక్షోభం అనే భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రతి గృహం, ప్రతి రైతన్న, ప్రతి పారిశ్రామికవేత్త నీటి పొదుపులో భాగస్వామ్యులుగా మారేలా విప్లవాత్మకమైన మార్గదర్శకాలను అమలు చేయాలి.ప్రజలను ఈ విపత్తు నిర్వహణలో భాగస్వామ్యం చేసినప్పుడే ప్రభుత్వాలపై భారం తప్పుతుంది, కాస్త రిలీఫ్ దొరుకుతుంది.పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం, విపరీతంగా వేడెక్కుతున్న సముద్రాలు రాబోయే కాలంలో ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికల ప్రకారం, ఈ సహజ వాతావరణ దృగ్విషయం డిసెంబర్‌లో శిఖరాగ్రానికి చేరుకుని 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల వల్ల పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఈ ఎల్ నినో ప్రభావం తోడవడంతో 2027 అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్‌హౌస్ ఉద్గారాలు భూమిని నిరంతరం వేడెక్కిస్తున్నాయి. దీనికి తోడు ఎల్ నినో కారణంగా సముద్రాల నుండి విడుదలయ్యే అదనపు వేడి వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తుంది. ఈ రెండు పరిణామాలు కలిసికట్టుగా పనిచేయడం వల్ల, రాబోయే 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతలలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సహజ సిద్ధమైన వాతావరణ చక్రం. అయితే దీని ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా టెలికనెక్షన్ ప్రభావం చూపుతుంది.ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఆసియా–పసిఫిక్ ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాభావం, కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. దక్షిణ అమెరికాలోని పశ్చిమ తీర ప్రాంతాలు పెరూ, ఈక్వెడార్ వంటి దేశాలు భారీ వర్షాలు, ఆకస్మిక వరదలను ఎదుర్కొనే అవకాశం ఉంది.వాతావరణంలో వచ్చే ఈ తీవ్రమైన మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆసియా, ఆస్ట్రేలియాలో వర్షపాతం తగ్గడం వల్ల గోధుమ, బియ్యం వంటి ప్రధాన పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సముద్ర జీవగోళం, ముఖ్యంగా పగడపు దిబ్బలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. విపత్కర పరిస్థితులను దాటవేయడంలో పాలకుల ముందుచూపు, ప్రజల సహకారం రెండు చక్రాలలా పనిచేస్తాయి. కనీవినీ ఎరుగని ఈ నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణ రూపొందించి, క్షేత్రస్థాయిలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే, రాబోయే వేసవిలో ప్రజాగ్రహం తుఫానులా మారి ప్రభుత్వాల కొలువులను కూల్చడం తథ్యం. కాలం దాటిపోకముందే అప్రమత్తమై, ప్రతి చుక్క నీటిని భద్రపరిచే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించడమే పాలకుల ముందున్న ఏకైక కర్తవ్యం.

# దీదీ.... దయనీయమైన సంక్షోభం

**బెంగాల్, అక్టోబరు 13:**బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాల పాటు ఎదురులేని శక్తిగా చక్రం తిప్పిన దీదీ మమతా బెనర్జీ నేడు తన రాజకీయ జీవితంలోనే అత్యంత దయనీయమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వామపక్షాల మూడు దశాబ్దాల కంచుకోటను బద్దలుకొట్టి తృణమూల్ కాంగ్రెస్ ని అధికారంలోకి తెచ్చిన నాటి దూకుడు, ఆమె సొంత పార్టీలోనే నిట్టనిలువునా చీలిక రావడంతో ఒక్కసారిగా ఆవిరైపోయింది. తిరుగుబాటు వర్గం మెజారిటీ ఎంపీలు, ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకుని అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాను దక్కించుకోవడమే కాకుండా, పార్టీ అసలు పేరు, చిహ్నంపై కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పైచేయి సాధించే దిశగా పావులు కదుపుతోంది. మెజారిటీ ప్రజాప్రతినిధులు రెబెల్ క్యాంప్ వైపు మొగ్గు చూపడంతో, మమత తన సొంత పార్టీతోనే పోరాడలేని అత్యంత బలహీనమైన స్థితికి దిగజారిపోయారు.ఈ రాజకీయ పతనానికి నిన్న మొన్నటి ఉపఎన్నికల ఫలితాలే తిరుగులేని నిదర్శనంగా నిలిచాయి. కేంద్ర ఎన్నికల సంఘం పార్టీ గుర్తును స్తంభింపజేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసిన తర్వాత.. తన సొంత పేరునే పెట్టుకుని మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరిట బరిలోకి దిగినప్పటికీ ప్రజలు ఆమెను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఒకప్పుడు బెంగాల్ రాజకీయాలను శాసించిన ప్రజా నాయకురాలి పార్టీకి నియోజకవర్గాల్లో కనీసం మూడు వేల



ఓట్లు కూడా రాలేదంటే, క్షేత్రస్థాయిలో ఆమె ప్రజాదరణ ఎంతటి పాతాళానికి పడిపోయిందో స్పష్టమవుతోంది. కార్యకర్తల యంత్రాంగం తిరుగుబాటు వర్గం వెంటే నడవటం, సాధారణ ఓటర్లు సైతం మమత గ్రూపును ఏమాత్రం నమ్మకపోవడంతో ఆమె పార్టీ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారింది. సొంత నేతలే వెన్నుపోటు పొడిచారన్న సానుభూతి కూడా ప్రజల్లో కనీస ప్రభావం చూపలేకపోయింది.ఇకపై ఒంటరిగా పోరాడి పార్టీని నిలబెట్టుకోవడం మమతా బెనర్జీకి అసాధ్యమైన పనిగా మారింది. ఎంపీల్లో ఎక్కువ మంది ఇప్పటికే బీజేపీ వైపు , ప్రత్యేక కూటముల వైపు కదలడం, బెంగాల్ అసెంబ్లీలో రెబెల్ నేతలే కీలకంగా మారడంతో మమత గ్రూపు కేవలం ఒక చిన్నపాటి అసమ్మతి గ్రూపుగా మిగిలిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో తన స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకోవాలని చూస్తే రాజకీయంగా పూర్తిగా కనుమరుగైపోవడం ఖాయం. అందువల్ల, గతంలో తృణమూల్ ఆవిర్భావానికి మూలమైన కాంగ్రెస్ పార్టీ వైపు మమత మళ్లీ చూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. తాను స్థాపించిన పార్టీ చీలిక వర్గం చేతుల్లోకి వెళ్లిపోవడాన్ని చూస్తూ కూర్చోవడం కంటే, మిగిలిన తన బలాన్ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడమే ఆమెకు మిగిలిన ఏకైక గౌరవప్రదమైన మార్గంగా కనిపిస్తోంది.కాంగ్రెస్‌లో విలీనం ద్వారానే మమత జాతీయ స్థాయిలో తన గుర్తింపును కొంతవరకైనా కాపాడుకునే అవకాశం దక్కుతుంది. రాష్ట్రంలో విస్తరిస్తున్న బీజేపీని, తిరుగుబాటు తృణమూల్ వర్గాన్ని ఏకకాలంలో ఢీకొట్టే సంస్థాగత బలం ప్రస్తుతం మమత వద్ద లేకపోవడంతో.. జాతీయ పార్టీ గొడుగు కింద చేరితేనే మనుగడ సాధ్యమవుతుంది. కాంగ్రెస్‌తో కలవడం వల్ల కనీసం బెంగాల్‌లో లౌకిక ఓటు బ్యాంకును కొంతవరకైనా ఏకం చేయగలగడమే కాకుండా, కేంద్ర స్థాయిలో విపక్షాల కూటమిలో బలమైన స్వరాన్ని కొనసాగించవచ్చునని భావిస్తున్నారు. మరి మమతా బెనర్జీ ఏం సాధిస్తారో ?

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి..

## ముగ్గురు అరెస్ట్.. రూ.17,300 నగదు స్వాధీనం

**మెదక్, అక్టోబర్ 13:** మెదక్ జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా కూల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లి గ్రామంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్ వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని కూల్చారం గ్రామానికి చెందిన సత్యనారాయణ, శేఖర్, నర్సింలుగా గుర్తించారు. పేకాటకు సంబంధించి కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ



సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ..

జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, సమాచారం అందిన వెంటనే దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## కార్మికుల సంక్షేమానికి

# కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటన.
- ప్రజా భవన్‌లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్
- సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా..
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్
- 15 రోజుల్లో పెండింగ్ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు..
- కార్మికుల పిల్లలకు న్యాయం చేస్తామని ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**గోదావరిఖని :**సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల అభివృద్ధి, కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాల కల్పనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఈరోజు ప్రజా భవన్‌లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణ రావు గశ్రీ, ఎమ్మెల్యేలు ప్రేమసాగర్ రావు గండ్ర సత్యనారాయణ రావు తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఈ సమావేశంలో పాల్గొని సింగరేణి కార్మికులకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు.

**సింగరేణి లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా**

సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో కార్మికులకు వాటా ప్రకటించడం ద్వారా వారి శ్రమకు తగిన గుర్తింపు కల్పించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం రూ.1,754 కోట్ల లాభాల నేపథ్యంలో కార్మికులకు 34 శాతం వాటాను ప్రకటించారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా అందించడం వారి కష్టానికి తగిన గౌరవాన్ని అందించడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు కూడా దోహదపడనుంది.సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సైతం ప్రభుత్వం శుభవార్త అందించింది. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్ ప్రకటించడం ద్వారా వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. సంస్థ అభివృద్ధిలో రెగ్యులర్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర కూడా కీలకమని గుర్తిస్తూ వారికి ప్రయోజనాలు కల్పించే దిశగా నిర్ణయాలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# మోదీపై వ్యాఖ్యలు.. పరువు నష్టం కేసులో రాహుల్‌కు సుప్రీంలో తాత్కాలిక ఊరట...

- పరువునష్టం కేసు విచారణపై కింది కోర్టు విచారణపై స్టే
- మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు
- నాలుగు వారాల్లో స్పందన తెలియజేయాలని ఆదేశం
- 2018 రాజస్థాన్ సభలో మోదీపై వ్యాఖ్యల నేపథ్యంలో కేసు



**న్యూఢిల్లీ:**ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎదుర్కొంటున్న పరువునష్టం కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో కింది కోర్టు విచారణపై మధ్యంతర స్టే విధించింది. రాహుల్ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పరువునష్టం కేసును కొట్టివేయాలన్న రాహుల్ అభ్యర్థనను బాంబే హైకోర్టు గతంలో తిరస్కరించింది. ఈ ఉత్తర్వులను ఆయన సుప్రీంకోర్టులో సవాలు చేశారు. రాహుల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. తదుపరి విచారణ జరిగే వరకు కింది కోర్టు ప్రక్రియను నిలిపివేస్తూ ధర్మాసనం ఆదేశాలిచ్చింది. 2018 సెప్టెంబరులో రాజస్థాన్‌లో జరిగిన ఓ సభలో ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని బీజేపీ నేత మహేశ్ ముకుంచంద్ శ్రిమాల్ ఫిర్యాదు చేశారు. 'చోరోంకే సర్దార్', 'కమాండర్ ఇన్ థీఫ్' వంటి పదాలతో ప్రధాని ప్రతిష్ఠకు భంగం కలిగించారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు బీజేపీ సభ్యుల గౌరవాన్ని కూడా దెబ్బతీశాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులోని అంశాలను పరిశీలించిన గిర్గావ్ మెజిస్ట్రేట్ కోర్టు 2019 ఆగస్టులో రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. ఈ క్రిమినల్ చర్యలను రద్దు చేయాలని ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. అయితే, సమన్ల జారీలో స్పష్టమైన చట్టవిరుద్ధత కనిపించడం లేదంటూ సెప్టెంబరు 8న హైకోర్టు ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. వ్యాఖ్యలు పరువునష్టం కిందకు వస్తాయా? వాటి ప్రభావం ఎంత? అన్నది విచారణలో తేలాల్సి ఉందని పేర్కొంది. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రాహుల్‌కు ఆరు వారాల పాటు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు నుంచి మినహాయింపు కూడా ఇచ్చింది.

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడిని కాపాడిన హోంగార్డు

## సమయస్ఫూర్తితో వృద్ధుడి ప్రాణాలు కాపాడిన హోంగార్డు వి. అంజనేయులు

**కరీంనగర్ అక్టోబర్ 13:**వ్యక్తిగత సమస్యల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బొమ్మిడేని కొమురయ్య (80) అనే వృద్ధుడిని కరీంనగర్ లేక్ అవుట్‌పోస్ట్‌కు చెందిన హోంగార్డు 767 వి. అంజనేయులు సమయస్ఫూర్తితో స్పందించి కాపాడారు. అనంతరం వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. లేక్ అవుట్‌పోస్ట్ ఆర్ఎస్ఐ బి. రమేష్ కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వృద్ధుడికి అండగా ఉండాలని, వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందులు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేలా సహకరించాలని సూచించారు. ఆపద సమయంలో తక్షణమే స్పందించి ప్రాణాలను కాపాడిన హోంగార్డు వి. అంజనేయులును పోలీసు అధికారులు అభినందించారు.

# హైదరాబాద్ రవాణా ముఖచిత్రంలో భారీ మార్పులు!



**హైదరాబాద్ , అక్టోబరు 13:**మెట్రో నగరాలలో ట్రాఫిక్ రద్దీ పెద్ద సమస్యగా మారింది. నగరాల సుందరీకరణ, ప్రయాణ సౌలభ్యం కోసం ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. అయితే.. క్షేత్రస్థాయి పరిస్థితులు, వ్యయ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కొన్ని ప్రాజెక్టులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్ లో అత్యంత రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టాల్సిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళికలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ పలు మార్పులు చేసింది.గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం, కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు రూ.1,090 కోట్ల వ్యయంతో ఏడు అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లైఓవర్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే.. నగరంలో మారుతున్న ట్రాఫిక్ అవసరాలు, స్థానిక భౌగోళిక పరిస్థితులు, వ్యయ నియంత్రణను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.కొత్త ప్రణాళికల ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫ్కంజా ఇంజనీరింగ్ కాలేజీ వరకు రూ.715.16 కోట్ల అంచనా వ్యయంతో సరికొత్త స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన బంజారాహిల్స్ నుంచి ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద 2-లేన్ సింగిల్ వే ఫ్లైఓవర్, టీవీ9 జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు వంటి అనేక పనులను రద్దు చేశారు. ఈ మార్పుల వల్ల గతంలో కేఎన్‌ఆర్ కన్స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌ను రద్దు చేశారు. అంతేకాక, ఆ ఏజెన్సీ చెల్లించిన డిపాజిట్లను వెనక్కి ఇవ్వాలని నిర్ణయించారు.మొత్తం ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించి పనులను వేగవంతం చేయాలని కమిటీ భావిస్తోంది. ప్యాకేజీ-1 పరిధిని జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. గతంలో రూ.580 కోట్లుగా అంచనా వేసిన ఈ ప్రాజెక్టు వ్యయాన్ని సవరిస్తూ, రూ.365.85 కోట్లకు కుదించారు. అలాగే రోడ్డు నంబర్-45 జంక్షన్, ఫిలింనగర్ జంక్షన్ ప్రాంతాల్లోని పనుల ప్రణాళికను కూడా మార్చారు.ప్యాకేజీ-2 కింద ముగ్ధ జంక్షన్ నుంచి ముఫ్కంజా కాలేజీ వరకు, బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1కి అనుసంధానించే రాంపుతో కూడిన స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రూ.510 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.349.31 కోట్లకు సవరించారు. ఈ రెండు ప్యాకేజీల నిర్మాణ పనులను ప్రస్తుతం మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థకు అప్పగించాలని స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది.కేవలం రవాణా రంగానికే కాకుండా, నగరంలోని ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా స్టాండింగ్ కమిటీ పెద్దపీట వేసింది. ఆరాంఘర్ -- జూపార్కు మార్గంలో 6-లేన్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణానికి రూ.799.74 కోట్ల సవరించిన అంచనాలను ఆమోదించారు. అలాగే ఒవైసీ హాస్పిటల్, బహాదుర్‌పురా జంక్షన్ల వద్ద మల్టీలెవెల్ ఫ్లైఓవర్ల కోసం రూ.161 కోట్లు కేటాయించారు. మరోవైపు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ, డ్రైనేజీ వ్యవస్థల ఆధునికీకరణ, ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించారు. చింతల్ చెరువుకు రూ.20 కోట్లు, రాంపల్లి చెరువు అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు చేయడం ద్వారా జలవనరుల పరిరక్షణకు పెద్దపీట వేసినట్లైంది.

# ఉచిత విద్యుత్ కు ఎసరు పెట్టే కుట్ర..

## రైతు డిస్కమ్ ఏర్పాటు జీవోపై హరీశ్‌రావు సీరియస్



ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సహా ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, సామాజికవేత్తలు, రైతులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జీవో17 జారీ చేయడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, రైతు మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర అని ప్రశ్నించారు. వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెరతీయడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు ఒరిగే ప్రయోజనం ఏమిటి? రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ నిర్ణయం ఎలా దోహదపడుతుందో చెప్పకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. సర్కార్ నిర్వాకంతో అన్నదాత మరింత ఇబ్బందుల్లో పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోతే దిక్కు లేదు.. రేపు రైతు డిస్కం తో మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని అన్నారు. రైతు మెడకు రైతు డిస్కం ఉచ్చు..ఉచిత విద్యుత్ పై చేతులెత్తేసేందుకే సర్కార్ కొత్త ఎత్తుగడ అని తెలిపారు. పంటలు ఎండి రైతు కన్నీరు పెడుతుంటే.. డిస్కంల పేరిట రేవంత్ సర్కార్ రాజకీయ చదరంగం ఆడుతున్నదని అన్నారు. జీవో ప్రకారం కొత్త డిస్కమ్ పరిధిలోకి 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, ఎవీఔూదీ, మిషన్ భగీరథ.. మొత్తంగా 30,62,853 కనెక్షన్లు రైతు డిస్కం కి బదిలీ చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత భారీ వ్యవస్థ నిర్వహణ కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. కేవలం 25శాతం థర్మల్ పవర్ అలకేషన్ తో రైతులకు సాగు, ప్రజలకు తాగు నీళ్లకు అవసరం అయ్యే భారీ విద్యుత్ వ్యవస్థ ఎలా నడుస్తుందని నిలదీశారు. 6,15,651 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, 2.51 లక్షల సర్క్యూట్ కిలోమీటర్ల వ్యవసాయ ఎల్‌టీ లైన్లు.. వీటి నిర్వహణకు సరిపడా సిబ్బంది లేకపోతే రైతుల కష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారని అడిగారు. రాష్ట్ర విద్యుత్ కేటాయింపుల్లో ఇప్పటికీ 53.28 శాతం థర్మల్ విద్యుత్తే ఉందని.. సౌర విద్యుత్తు వాటా 35.31 శాతం మాత్రమే అని హరీశ్‌రావు తెలిపారు. ఇందులో థర్మల్ 25%, సోలార్ 58%, హైడల్ మొత్తంగా 100% రైతు డిస్కమ్ కు కేటాయించారని అన్నారు. పగటి పూట మాత్రమే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయితే, రాత్రి పూట ఉండదని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పే ప్రభుత్వం.. పగటిపూట మాత్రమే విద్యుత్ ఇచ్చి, రాత్రివేళ రైతులను చీకట్లోకి నెట్టబోతోందా అని అనుమానం వ్యక్తం చేశారు. 2325 వీఔ హైడల్ (జల విద్యుత్) పవర్ మొత్తం రైతు డిస్కమ్‌కే కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ హైడల్ పవర్ సాంకేతికంగా ఏడాదిలో కేవలం 3-4 నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అంటే మిగతా 8 నెలలు రైతు డిస్కమ్‌కి ఈ విద్యుత్ అందుబాటులో ఉండదు. అప్పుడు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు భారీ రుణాలు, బకాయిలను కేటాయిస్తూ.. దాని ఆర్థిక స్థిరత్వంపై ప్రభుత్వం ఏం భరోసా ఇస్తోంది? ఈ అప్పుల భారం చివరకు రైతులపై పడేయాలని చూస్తున్నారా? రైతు డిస్కమ్ పేరుతో వ్యవసాయ విద్యుత్ బాధ్యతలను వేరుచేసి, రేపు నష్టాల సాకుతో రైతులపై ఆంక్షలు విధించే ప్రమాదం లేదా అని నిలదీశారు. రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగుతుందని, 24 గంటల సరఫరాలో ఎలాంటి కోతలు ఉండవని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వగలదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేయకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లడం కుదరదని అన్నారు. కొత్త సంస్థ ఏర్పాటుతో అదనపు పరిపాలనా ఖర్చులు ఎంత? ఆ ఖర్చులను ఎవరు భరిస్తారు? ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల బదిలీపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైతుల పేరుతో డిస్కమ్ ఏర్పాటు చేయడం గొప్ప కాదు.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం ముఖ్యం. సంస్థల పేర్లు మార్చడం, కొత్త సంస్థలు ఏర్పాటు చేయడం కాదు.. రైతుల విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు.. రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే వారి అభ్యంతరాలను పక్కనపెట్టి ఎందుకు ముందుకెళ్తున్నారు? ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు లేవనెత్తిన సందేహాలకు సమాధానం చెప్పకుండా చాటు మాటుగా జీవో జారీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల్లో అనుమానాలు, ఆందోళనలు ఎందుకు పెంచుతోందని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. రైతు డిస్కమ్ వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక భారం, సిబ్బంది నిర్వహణపై పూర్తి వివరాలు వెల్లడించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లకూడదని చెప్పారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వెనుక రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.. లేదంటే తక్షణం జీవో ఉపసంహరించుకోవాలి అని యావత్ రైతాంగం పక్షాన డిమాండ్ చేశారు.

# వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలి..

## చెల్పూరులో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకుల ధర్నా

**జయశంకర్ భూపాలపల్లి:** రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు గ్రామంలో జాతీయ రహదారిపై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ధర్నాలో గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం ఐదు నుంచి ఆరు గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపించారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరైన సమయంలో విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని, పొలాల్లో భూమి బీటలు వారుతోందని పేర్కొన్నారు.

# తెలంగాణలో ఎల్‌నినో దెబ్బ..

- మొదటి పేజీ తరువాయి

రోజుల్లో వర్షాలు ఆశించిన మేర కురిసే అవకాశం ఉండకపోవచ్చన్నారు. వ్యవసాయానికి అవసరమైన నీటితోపాటు ప్రజలు తాగునీటి అవసరాలను తీర్చడం కూడా సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు సాధ్యమైనంత వరకు నీటిని అందించి వాటిని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. రెండో పంట వేసి ఆ తర్వాత నీరు అందక పంటలు ఎండిపోయినట్లయితే.. రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రులు హెచ్చరించారు. అందువల్ల పరిస్థితులను అర్థం చేసుకుని యాసంగి సాగు విషయంలో ప్రభుత్వం సూచనలను పాటించాలని రైతులను కోరారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతమేర తగ్గించే అవకాశం ఉందని తెలిపారు. నీటి లభ్యతపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతే, అది తాగునీటి సరఫరాతో పాటు సాగునీరు, జలవిద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. పంటలు వేసే ముందు నీటి లభ్యతను అంచనా వేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ముందుగా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ఆయన అన్నారు. వర్షపాతం లేకపోవడంతో పాటు, విద్యుత్ సరఫరాలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. బయటి మార్కెట్ నుండి నిత్యావసర విద్యుత్‌ను కొనుగోలు చేయడం రోజురోజుకు ఖరీదైనదిగా మారుతోందని ఆయన అన్నారు. యూనిట్‌కు రూ.15 చెల్లించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రజలకు విద్యుత్ లభించని పరిస్థితులు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రజలు అవసరమైనంత మాత్రమే విద్యుత్‌ను వాడుకుని డబ్బు ఆదా చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలను కవర్ చేస్తూ ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని పేర్కొంటూ, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలలో అవగాహన పెంచాలని ఆయన సూచించారు. పంట కోత పూర్తయ్యే వరకు నీటి కొరతను నివారించడానికి, ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా చూసుకోవడానికి అధికారులు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక వార్ రూమ్ మరియు టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయడంపై కూడా దృష్టి సారించింది. కరువును ఎదుర్కొంటున్న జిల్లాలకు సహాయం అందించడానికి మరియు కరువు నివారణ చర్యలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అభ్యర్థించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత 125 పనిదినాలకు అదనంగా, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మరో 50 రోజుల పనిని అభ్యర్థించే విషయాన్ని కూడా పరిశీలిస్తోంది.ఎల్ నినో ప్రభావం, కరువు పరిస్థితి, రైతుల సమస్యలు, తాగునీరు మరియు సాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరాపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో త్వరలో ఒక ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాబోయే నెలల్లో ప్రభుత్వ పనితీరుకు మార్గదర్శకంగా ఉంటాయి.

# జంతర్‌మంతర్ బంద్..

- మొదటి పేజీ తరువాయి

ఒక్కరోజు బుకింగ్‌కు తొలుత రూ.1.21 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు వెల్లడించారు. మైదాన్‌లో చిన్న ప్రాంతాన్ని ఉచిత నిరసనలకు కేటాయించినా.. అక్కడ కేవలం 150 మందికే అవకాశం ఉంది.ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగం ద్వారా మైదాన్‌ను బుక్ చేసుకోవాలి. దరఖాస్తుకు ఢిల్లీ పోలీసుల నిరభ్యంతర పత్రం తప్పనిసరి. అక్టోబరు 11న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగించారు. దాని స్థానంలో రామ్‌లీలా మైదాన్, బురారీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ మైదాన్‌లను కేటాయించారు. ఈ మూడు ప్రాంతాల్లో నిరసనల నిర్వహణకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను ప్రత్యేకంగా విడుదల చేస్తామని పోలీసులు తెలిపారు.రామ్‌లీలా మైదాన్ రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతంలో ఉంది. సమీపంలో మూడు ఆసుపత్రులు, మున్సిపల్ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. భారీ సభలు జరిగినప్పుడు చుట్టుపక్కల రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని అధికారులు చెబుతున్నారు. అసఫ్ అలీ రోడ్డులో వాహనాల రాకపోకలను వన్‌సైడ్‌గా మార్చడంతో పాటు ఇతర మార్గాల్లోనూ మళ్లింపులు చేపట్టాల్సి వస్తుంది. 2014లో ఇక్కడ జరిగిన బీజేపీ సభ కారణంగా దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఐటీఓ వరకు ట్రాఫిక్ స్తంభించిందని ఓ అధికారి గుర్తుచేశారు.ఒకప్పుడు చెరువుగా ఉన్న ఈ ప్రాంతాన్ని 1930 నాటికి చదును చేశారు. 1932 నుంచి ఇక్కడ రామ్‌లీలా వేడుకలు నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్యం తర్వాత శరణార్థులకు ఉపాధి కల్పించేలా 1951లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం దేశ రాజకీయాల్లోనూ ఈ మైదాన్ కీలక వేదికగా నిలిచింది. 1975లో అత్యవసర పరిస్థితి ప్రకటించిన రోజున జయప్రకాశ్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి ఇక్కడ సభలో ప్రసంగించారు. 2013లో అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఇక్కడే ప్రమాణ స్వీకారం చేశారు.

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

- మొదటి పేజీ తరువాయి

ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

# దీపావళి తర్వాత యూపీఐ ఛార్జీల అమలు

- మొదటి పేజీ తరువాయి

లావాదేవీపై రూ.8, అలాగే రూ.10,000 లావాదేవీపై రూ.40 చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ ఛార్జీల భారం వినియోగదారులపై పడదని, కేవలం వ్యాపారులు మాత్రమే చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎంత పెద్ద లావాదేవీ అయినా గరిష్ఠంగా రూ.300 మించి ఛార్జీ విధించరు. ఉదాహరణకు, రూ.75,000 అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 మాత్రమే వసూలు చేస్తారు.రైల్వే, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం, వ్యవసాయ ముడిసరుకులు వంటి కొన్ని కీలక రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఫ్లాట్‌గా రూ.5 ఛార్జీని ప్రతిపాదించారు. వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు (పీ2పీ), అలాగే రోజువారీ చిన్న వ్యాపార లావాదేవీలు యథాతథంగా ఉచితంగానే కొనసాగుతాయి. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, సైబర్ సెక్యూరిటీ, మోసాల నివారణ, కస్టమర్ సపోర్ట్ వంటి మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చేందుకే ఈ ఛార్జీలను ప్రతిపాదించినట్టు కేంద్రం వివరించింది.

# అధికారం అజమాయిషీకి కాదు..

- మొదటి పేజీ తరువాయి

మార్గం సుగమం చేస్తోందని తెలిపారు మోదీ.

**ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు**

భారత్ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు లాంటిదని అభివర్ణించిన మోదీ.. దేశంలో 100కు పైగా భాషలు, సుమారు 80 వేల వార్తాపత్రికలు, ప్రచురణలు, వెయ్యికి పైగా శాటిలైట్ టీవీ ఛానళ్లు ఉన్నాయని తెలిపారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా అకౌంట్లలోనూ 50 కోట్ల మందికి భారతీయులు చురుగ్గా ఉంటున్నారని వివరించారు. వ్యక్తుల భిన్నాభిప్రాయాలను బహిరంగంగా చర్చించుకునేందుకు డిజిటల్ టెక్నాలజీ ఎంతగానో దోహదపడుతోందన్నారు.

**ప్రజల సాధికారతే లక్ష్యం**

ప్రభుత్వానికి అధికారం ఉన్నప్పటికీ.. అజమాయిషీ చెలాయించడం, ప్రజలను వ్యవస్థపై ఆధారపడేలా చేయడం దాని లక్ష్యం కాకూడదని మోదీ పేర్కొన్నారు. బదులుగా వారిని మరింత బలోపేతం చేసి, సాధికారత కల్పించి ఎదిగేలా చేయడానికి అది ఉపయోగపడాలని.. ప్రస్తుతం భారత్ అదే మార్గంలో పయనిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారన్న ఆయన.. ఇది ప్రపంచంలోని అనేక దేశాల జనాభా కంటే ఎక్కువ అని పేర్కొన్నారు.

# హైస్పీడ్ రైల్ కారిడార్ల చిచ్చు!

- మొదటి పేజీ తరువాయి

కేటాయించడాన్ని ప్రాథమికంగా ఖరారు చేసుకున్నారు. రాష్ట్ర కేబినెట్ సైతం దీనికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది.అంతర్గతంగా మార్గాలను నిర్ణయించుకున్న అధికారులు, హాలియా వంటి పలు ప్రాంతాల్లో ఎరుపు, తెలుపు రంగులతో మార్కింగ్‌లు కూడా చేశారు. తెలంగాణ పరిధిలో ముంబై-పుణే కారిడార్ 93 కిలో మీటర్లు, హైదరాబాద్-బెంగళూరు 205 కిలోమీటర్లు, హైదరాబాద్-చెన్నై 180 కిలోమీటర్ల చొప్పున మార్గాలను ప్రతిపాదించారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పక్కనే వెళ్లేలా సవరణలు కూడా చేశారు. ఇదంతా సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ప్రకటన ఈ ప్రణాళికలన్నింటినీ ఒక్కసారిగా గందరగోళంలోకి నెట్టింది.కారిడార్ల అలైన్‌మెంట్ ఇంకా ఖరారు కాలేదని, భూసేకరణ చేయడం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర మంత్రి స్పష్టం చేయడం వెనుక రాజకీయ కోణం స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని, భూముల గుర్తింపు కోసం అధికారులను రంగంలోకి దించడం, దీనివల్ల ప్రజల్లో భయాందోళనలు తలెత్తడం రాజకీయంగా అధికార పార్టీకి ఇరుకును తెస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కింగ్‌లు వచ్చిన తర్వాత, అసలు అలైన్‌మెంట్ ఖరారే కాలేదనడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపాన్ని లేదా రాజకీయ లబ్ధి కోసమే ఉద్దేశపూర్వకంగా చేస్తున్న జాప్యాన్ని ఎత్తిచూపుతోంది.ఒకవైపు అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో తాము వేగంగా అడుగులు వేస్తుంటే, కేంద్రం మాత్రం నిబంధనల పేరుతో బ్రేకులు వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ముందుకు వెళ్తే సహించేది లేదనే సంకేతాలను కేంద్రం పంపుతోంది. మొత్తానికి, హైస్పీడ్ రైల్ కారిడార్ల అలైన్‌మెంట్ తకరారు కేవలం సాంకేతిక సమస్య కాస్తా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాజకీయ రగడగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వార్తాతరంగాలు

బుధవారం 14 అక్టోబర్ 2026

# సింగరేణి కార్మికులకు దసరా ధమాకా..

ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్

సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్

కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు

పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా

అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913

పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం



**హైదరాబాద్:** దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది. సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది. బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కుంటున్నారు: సబితా ఇంద్రారెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 13:** తెలంగాణలో రైతులకు ప్రభుత్వం భరోసా ఇవ్వడం లేదంటూ ప్రభుత్వంపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను పంటలు వేసుకోవద్దని అంటున్నారని మండిపడ్డారు. రైతులకు కరెంటు, సాగు నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. తాగు నీరు ఇచ్చే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మెట్రో టెండర్లను రద్దు చేసిందన్నారు. కొత్తగా బుల్లెట్ ట్రైన్లు తీసుకువస్తామని అంటున్నారని.. బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఖరారు కాలేదని కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్ చెప్పారని తెలిపారు. అలైన్‌మెంట్ ఖరారు కాకుండా భూ సేకరణ చేస్తే చట్టవిరుద్ధమని కేంద్ర మంత్రి చెప్పారని సబిత తెలిపారు. ఏ ఉద్దేశంతో బహదూర్‌గూడ భూములను తీసుకున్నారని ప్రశ్నించారు. రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. కొండగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఓట్లు వేసిన నియోజకవర్గ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నలుమూలలా వేల ఎకరాల భూములు తీసుకుంటున్నారని మాజీ మంత్రి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి భూదాహం ఎందుకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కొత్వాల్ గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రోడ్డు ఎందుకు వేస్తున్నారని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని విమర్శించారు. నాదర్ గుల్ భూములు ప్రభుత్వ భూములని.. కానీ వాటిని ప్రైవేటు వాళ్లు వచ్చి ఆక్రమిస్తున్నారన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సబితా ఇంద్రారెడ్డి హితవుపలికారు.

# ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం

కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందన



తెలంగాణలోని పలు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గడ్కరీ ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు గణనీయంగా తీరనున్నాయి. వీటితో పాటు, కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్‌ల శంకుస్థాపన ప్రతిపాదనకు కూడా ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలను కలిపే హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనపై కూడా గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఇదే క్రమంలో, నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇండియన్ రోడ్' కాంగ్రెస్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని గడ్కరీని ఆయన ఆహ్వానించారు.

# మెదక్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం..

రజక సంఘం ఆందోళన

**మెదక్:** మెదక్ పట్టణంలో తెల్లవారుజామున చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కావడం కలకలం రేపింది. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన నేపథ్యంలో సీఐ మహేష్ ఆధ్వర్యంలో విగ్రహం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకారులు సంయమనం పాటించాలని సీఐ సూచించారు. ఘటనపై పోలీసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధ్యులను గుర్తిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. విగ్రహం ధ్వంసం ఘటనపై రజక సంఘం నాయకులు పోలీసుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. విగ్రహం వద్ద సరైన కోణంలో సీసీ కెమెరాలు లేకపోవడం, అందుబాటులో ఉన్న కెమెరాలు ఘటనను స్పష్టంగా గుర్తించే విధంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

# రాజకీయాల కన్నా ప్రజా సంతృప్తి కీలకం



**హైదరాబాద్ అక్టోబరు 13:** తెలంగాణ రాజకీయ తెరపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తులు, పైఎత్తులు ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లోనూ, మైండ్ గేమ్‌లోనూ తనదైన దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్.. పాలన విషయానికి వచ్చేసరికి మాత్రం అదే స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి గట్టిగా వినపడుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో సరికొత్త సంచలనాలు వస్తాయని ఆశించిన సామాన్య ప్రజలు.. కనీసం గతంలో అందిన సంక్షేమ పథకాలైనా సక్రమంగా అందుతాయా లేదా అనే సందేహంలో పడిపోయారు. గత బీఆర్ఎస్ హయాంలో అమలులో ఉండి, ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కొన్ని పథకాలు రేవంత్ రెడ్డి పాలనలో మందగించడం, అసలు అమలు కాకపోవడం ప్రధాన విమర్శలకు దారితీస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమల్లో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో, పాత పథకాల పంపిణీలో సైతం ఆలస్యం జరగడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లభించిన రైతు బీమా పథకాలు.. కాంగ్రెస్ తెచ్చిన రైతు భరోసా పేరు మార్పుతో పాటు ఆంక్షలు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సాగులో లేని భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం కట్ చేస్తామని ప్రకటించినప్పటికీ, అసలైన రైతులకు వానాకాలం, యాసంగి పెట్టుబడి సహాయం అందించడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు , రైతు సంఘాలు మండిపడుతున్నాయి. పేద కుటుంబాల్లో పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు అందడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది అప్లికేషన్లు పెండింగ్‌లో పడిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినప్పటికీ, పాత ఆర్థిక సహాయం రూ. 1,00,116 అందించడంలోనే నత్తనడక నడవడం ఆర్థిక లోటును తేటతెల్లం చేస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక లోటు, భారీ రుణభారం కారణంగానే సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయలేకపోతున్నామని పాలకపక్షం సమర్థించుకుంటున్నప్పటికీ.. ప్రజలకు మాత్రం లబ్ధి వేగంగా అందడం లేదనేది వాస్తవం. బీఆర్ఎస్ హయాంలో లోపాలున్నప్పటికీ పథకాలు నిరంతరాయంగా అందేవని, కానీ ఇప్పుడు నిధుల కొరత సాకుగా చూపి ఆలస్యం చేస్తున్నారనే భావన పల్లెల్లో వ్యక్తమవుతోంది. రాజకీయంగా ప్రత్యర్థులను కార్నర్ చేయడంలోనూ, పట్టు నిలుపుకోవడంలోనూ నిరంతరం బిజీగా ఉంటున్న రేవంత్ రెడ్డి.. గ్రౌండ్ లెవెల్ అడ్మినిస్ట్రేషన్‌పై అదేస్థాయి దృష్టి పెట్టలేకపోతున్నారనేది ఎక్కువ మంది అభిప్రాయం. ప్రతిపక్షాలపై విమర్శలతో సమయం గడపడం కంటే, ప్రజలకు నిత్యావసరాలుగా మారిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తేనే ప్రభుత్వానికి నిజమైన దూకుడు ఇమేజ్ లభిస్తుందని అంటున్నారు.

# సన్న బియ్యం ఎగుమతికి తెలంగాణ ప్రణాళికలు..

**హైదరాబాద్ , అక్టోబరు 13:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పండుతున్న మేలురకం సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లోని కొనుగోలుదారులతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవడంపై దృష్టి సారించింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 'అంతర్జాతీయ ప్రపంచ వరి సదస్సు (ఐడబ్ల్యుఆర్‌సీ) 2026'లో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాలను స్పష్టం చేసింది. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, తెలంగాణ బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ రిటైలర్లు, ఫుడ్ కంపెనీలు, ఎగుమతిదారులను ఆహ్వానించారు. కేవలం దేశీయంగా మిగులు నిల్వలను నిర్వహించడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక విలువను సృష్టించడంపై దృష్టి సారించామని ఆయన వివరించారు. దేశీయ ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు. గత సీజన్‌లో తెలంగాణలో 18.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగిన సన్న, మేలురకం బియ్యాన్ని బ్రాండెడ్, ట్రేసబుల్ (ఎక్కడ పండిందో గుర్తించే వీలున్న) పద్ధతిలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు 30,000 టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన అనుభవంతో ఈ కొత్త ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు ప్రభుత్వం ఎగుమతులపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 'సన్న బియ్యం' పీడీఎస్ పథకం కింద ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం, కొన్ని జిల్లాల్లో వరి సాగు తగ్గడం, ఎల్ నినో ప్రభావంపై ఆందోళనల కారణంగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గింది. దీంతో కొద్ది వారాల క్రితం కిలో రూ.70 ఉన్న సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.80–82కి చేరింది. 25 కిలోల బస్తా ధర రూ.2,150 సమీపంలో పలుకుతోంది. ఇదే సమయంలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సేకరణ వ్యయం అధికంగా ఉండటంతో ఎగుమతుల్లో పోటీని తట్టుకోలేకపోతున్నామని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. థాయ్‌లాండ్, వియత్నాం నుంచి తక్కువ ధరకే బియ్యం అందుబాటులో ఉండటం మధ్యప్రాచ్యం, పశ్చిమాఫ్రికా మార్కెట్లలో భారత బియ్యంపై ప్రభావం చూపుతోందని వారు పేర్కొంటున్నారు. అయితే, దేశీయ అవసరాలు, రైతుల నుంచి ధాన్యం సేకరణకు తొలి ప్రాధాన్యం ఇస్తూనే ఎగుమతి అవకాశాలను అన్వేషిస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.



# జీవనోపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు..



**సంగారెడ్డి, అక్టోబరు 13:** తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం తీవ్రమైన వలసల సంక్షోభంతో అల్లాడుతోంది. వర్షాలు లేకపోవడం, కరెంటు కోతలతో పంటలు ఎండిపోవడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు కరువవడంతో వేలాది మంది గిరిజన కుటుంబాలు పొట్టకూటి కోసం వలస బాట పడుతున్నాయి. పిల్లా జెల్లలతో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై సాగే ఈ వలసలు "బండి వెనక బండి కట్టి" అనే చైతన్య గీతికను గుర్తుకు తెస్తున్నాయి. తరాలు మారినా, ప్రభుత్వాలు మారినా ఈ వలసల విపత్తుకు కళ్లెం వేయలేకపోవడం ప్రభుత్వాల వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 167 రెవెన్యూ గ్రామాలు, 218 తండాలు ఉన్నాయి. సుమారు 70 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో, ప్రతి ఏటా చెరుకు కోత సీజన్ వచ్చిందంటే చాలు, తండాలు ఖాళీ అవ్వాల్సిందే వృద్ధులు, చదువుకుంటున్న పిల్లలు తప్ప మరెవరూ కనిపించరు. కొందరు తమ పిల్లలను బడి మాన్పించి మరీ తమతో పాటు వలసకు తీసుకువెళ్తున్నారు. చక్కెర కర్మాగారాలు తెరుచుకునే సమయంలో, దళారుల ద్వారా ముందే అడ్వాన్సులు తీసుకుని కుటుంబాలతో సహా వలస వెళ్తుంటారు. నారాయణఖేడ్ గిరిజనులది ప్రధానంగా వర్షాధారిత వ్యవసాయం. వర్షాలు సక్రమంగా పడకపోవడం, ఉన్న కొద్దిపాటి భూమిలో పంటలు వేసినా కరెంటు సమస్యలు, వాతావరణ పరిస్థితులు తీవ్ర భారాన్ని మోపుతున్నాయి. దీనితో చేతినిండా పనిలేక, అప్పుల పాలై, బతుకు దెరువు కోసం వలసలు అనివార్యమవుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. "మాకు ఏమీ లేవు. నీళ్లు బారట్లేదు. పొలాలు ఎండిపోతున్నాయి. 70 సంవత్సరాల వయసులో కూడా నేను చెరుకు కొట్టడానికి వెళ్తున్నాను. ఇక్కడ ఫ్యాక్టరీ లేదు, ఏదీ లేదు. మాకు తినడానికి కూడా లేవు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు సమస్యలు వానాకాలంలోనూ, ఎండాకాలంలోనూ తమను వేధిస్తున్నాయని, అందుకే పిల్లలతో సహా చెరుకు కోతకు వెళ్తున్నామని మరొక గిరిజనుడు పేర్కొన్నారు. జహీరాబాద్, సంగారెడ్డి జిల్లాల నుంచే కాకుండా, కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలకు సైతం ఈ వలసలు సాగుతున్నాయి. వలస వెళ్లిన చోట కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడుతున్నామని, అప్పుడు తమ కుటుంబాలు దిక్కు లేకుండా తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వలస బాట పట్టిన వారంతా వచ్చే ఏడాది మార్చి నాటికి సొంతూళ్లకు చేరుకుంటారు. ప్రజల ఆశ ఒక్కటే. "ఈ వలసల నివారణ కోసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి. మా ఎమ్మెల్యే గారు, ఎంపీ గారు చొరవ తీసుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసి తక్షణమే నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాం. మాకు స్థానికంగా జీవనోపాధి కల్పిస్తే ఇక్కడే పనులు చేసుకుంటాం" అని తండావాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. స్థిరమైన ఉపాధి అవకాశాలు, వ్యవసాయానికి సరైన మద్దతు లేకపోవడం నారాయణఖేడ్ గిరిజనుల జీవితాలను అగమ్యగోచరంగా మార్చుతోంది. ఈ సంక్షోభంపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, దీర్ఘకాలిక పరిష్కారాలను కనుగొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ట్రాక్టర్ కిందపడి వ్యక్తి దుర్మరణం..

**పాపన్నపేట, అక్టోబర్ 13:** ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి టైరు కింద నలిగి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని గాజులగూడెం శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాజులగూడెం గ్రామానికి చెందిన పుట్టల సాయిలు (44) ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అతని కుటుంబంలో విషాదం నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. గాజులగూడెం గ్రామానికి చెందిన సాయిలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన స్నేహితుడైన ట్రాక్టర్ డ్రైవర్ ఇస్మాయిల్‌తో కలిసి ఎంకెపల్లి గ్రామంలో నూతన ఇంటి నిర్మాణం కోసం పాత ఇంటి మట్టిని తరలించే పనికి వెళ్లాడు. ఈ క్రమంలో మట్టి తరలింపు జరుగుతుండగా సాయిలు ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. అదే సమయంలో ట్రాక్టర్ టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సాయిలుకు భార్య పోచమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు

# మంథనిలో అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులు పట్టివేత

**మంథని, అక్టోబర్ 13:** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెండు చిన్న ట్రాలీలలో ఆవులను కరీంనగర్‌కు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సోమన్న, ఎండీ తుఫాన్ కలిసి 11 ఆవులను రెండు చిన్న ట్రాలీలలో కరీంనగర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకున్నారు. పట్టుకున్న ఆవులను, అలాగే నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మంథని పోలీసులకు అప్పగించారు.

# జడ్చర్ల నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

## నవాబుపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధికి రూ.11.85 కోట్ల నిధులు

## విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట -- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, అక్టోబర్ 13(స్కై న్యూస్)** జడ్చర్ల నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 20 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం రూ.205.95 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబుపేట మండలంలో ఉన్న జడ్పీహెచ్చెస్ నవాబుపేట పాఠశాలకు రూ.11.85 కోట్ల నిధులు కేటాయించింది.ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా జీవో నంబర్ 188, తేదీ 09-10-2026ను జారీ చేసింది.ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ..“జడ్చర్ల నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మా ప్రభుత్వం



ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్ది, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.నవాబుపేట మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధి కార్యక్రమంలో చేర్చి, రూ.11.85 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరం. ఈ నిధులతో పాఠశాలలో ఆధునిక మౌలిక వసతులు, మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవకాశం ఏర్పడింది.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా సదుపాయాలు అందించడమే మా లక్ష్యం. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలి. జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తాను” అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తెలిపారు.

# మెదక్‌లో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం

## : దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్

మెదక్ జిల్లా కేంద్రంలో రాత్రి తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కూల్చివేసిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు, ఆగ్రహానికి దారితీసింది. ఈ ఘటనపై బహుజన సంఘాలు, ప్రజాసంఘాలు మరియు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బహుజనులపై కుట్రలను తిప్పికొడతాం: రాజ్యాధికార పార్టీ ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అచ్చంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ నారమోని నరేష్ యాదవ్ మాట్లాడుతూ ఘటనను తీవ్రంగా ఖండించారు.“తెలంగాణ ఉద్యమం, రజాకార్ల వ్యతిరేక పోరాటం, సాయుధ పోరాటాలలో వెట్టిచాకిరీ విముక్తి కోసం అసువులు బాసిన బహుజన ముద్దుబిడ్డ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కూల్చివేయడం అత్యంత బాధాకరం. సమాజంలో బహుజనుల విగ్రహాలను చూసి ఓర్వలేకనే




కొంతమంది దుండగులు ఇలాంటి చౌకబారు చర్యలకు పాల్పడుతున్నారు,” అని మండిపడ్డారు.బడుగు, బలహీన వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుతుండటం చూసి ఓర్వలేక వారి చైతన్యాన్ని అణచివేసేందుకు ఇలాంటి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. “మీకు దమ్ము, ధైర్యం ఉంటే ఎదురుగా వచ్చి పోట్లాడాలి తప్ప, రాత్రికి రాత్రే విగ్రహాలను ధ్వంసం చేయడం పిరికిపంద చర్య” అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇటీవలి కాలంలో బహుజన మహనీయుల విగ్రహాలపై దాడులు పెరుగుతున్నాయని, ఇలాంటి కుట్రలను ఎదుర్కొనేందుకు బిసి, ఎస్సీ, ఎస్టీ, బహుజనులందరూ ఏకమవుతున్నారని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి ఘటనకు బాధ్యులైన దుండగులను పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ నారమోని నరేష్ యాదవ్, బల్మూరు మండల అధ్యక్షుడు అమరేందర్ గౌడ్, అచ్చంపేట టౌన్ ప్రెసిడెంట్ ముద్దముల్ల నిరంజన్, టౌన్ జనరల్ సెక్రెటరీ మదునాగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని కోరిన తల్లోజు ఆచారి

**ఆమనగల్లు, అక్టోబర్ 13 (స్కై న్యూస్):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో



టీమ్ శ్రీ దుర్గా భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు శ్రీ తల్లోజు ఆచారి తన సతీమణి, ఆమనగల్లు మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీతా చారి తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని, జగన్మాత శ్రీ దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అధికారులు జర కన్నయ్యుండయ్యా ఇక్కడ......

**మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి 123 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పన్నులో ప్రారంభం జరుగుతుంది**

**ఆత్మకూర్ గద్వాల రహదారి దుస్థితి జర పట్టించుకోండి**

**ఆత్మకూర్ అక్టోబర్ 13 (స్కైన్యూస్)** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆత్మకూరు గద్వాల రహదారి దుస్థితి అధికారులకు జర కన్నేసి ఇటుపక్క చూడండి అంటూ రైతులు మరియు



గ్రామస్తులు మరియు వాహన చోదికులు అంటున్నారు ఆత్మకూర్ గద్వాల రహదారి పై బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక మట్టి రహదారికి ఎన్నిసార్లు మరమ్మతులు చేయవలసి వచ్చిన కూడా పైకెళ్ళి వాటర్ రావడంతో వేసిన మట్టి కంకర కు మొత్తం కొట్టుకపోవడంతో వాహనచోదికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ గద్వాలకు వెళ్తున్నారు ఆత్మకూరు టు గద్వాలకు ఈ విషయంపై కాంట్రాక్టర్లు మరియు అధికారులు పెద్దపెద్ద డోన్లు పైపులు వేసి మరమ్మతులు చేపట్టవలసిందిగా కోరడమైనది అలాగే పెద్ద పైపులు వేయడంతో ఏదో విధిగా వాటర్ పైపుల కెళ్ళి కిందకు వెళ్లిపోతాయి పైన రోడ్డు ఉండడంతో వాహన చోదకులకు ఎటువంటి తీవ్ర ఇబ్బంది కలగకుండా ఆత్మకూరు టు గద్వాలకు వాళ్ళ గమ్యానికి చేరుకోవడానికి వీలుగా పడుతుంది కావున అధికారులు ఇక్కడికి వచ్చి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోర డమైనది

## ఏడుపాయల వనదుర్గాభవాని అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి (చంద్రఘంటా) అలంకారంలో భక్తులకు దర్శనం

**పాపన్నపేట /మెదక్, అక్టోబర్ 13,(స్కై న్యూస్ ప్రతినిధి ):** ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ ఏడుపాయల వనదుర్గాభవాని అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి (చంద్రఘంటా) రూపంలో విశేషంగా అలంకరించుకుని భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ పుష్పాలు, సుందరమైన అలంకరణలతో అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

**ప్రత్యేక పూజలు.. భక్తుల సందడి**

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఏడుపాయలకు తరలివచ్చారు. ప్రత్యేక మండపంలో అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**భక్తులకు అన్నప్రసాదం**

నవరాత్రి ఉత్సవాలకు తరలివచ్చిన భక్తుల కోసం ఆలయ



నిర్వాహకులు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

**పోలీసుల గట్టి బందోబస్తు**

ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పాపన్నపేట ఎస్ఐ సారా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఆలయంలో పూజలు, ఇతర ఏర్పాట్ల నిర్వహణలో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సాయిబాబా, నరేష్, మహేష్, యాదగిరి, దీపక్ రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు.దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో ఏడుపాయల పుణ్యక్షేత్రం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## కరువు మండలం గా ప్రకటించాలి

**అమ్రాబాద్ అక్టోబర్ 13( స్కై న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఎల్నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు పడక అమ్రాబాద్ మండలంలో పత్తి పంటలు పూర్తిగా ఎండిపోయాయని, తక్షణమే అమ్రాబాద్ మండలాన్ని కరువు మండలముగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండలంలోని కల్మలోనిపల్లి గ్రామంలో ఎండిపోయిన పత్తి పంటలను నాయకులు



క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎస్. మల్లేష్, సీఐటీయూ జిల్లా నాయకులు జి. పర్వతాలు మాట్లాడారు. వర్షాలు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా వర్షాలు బాగా పడితే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పత్తి, ప్రస్తుతం కేవలం 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని వాపోయారు. కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో అమ్రాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సీహెచ్. బాలయ్య, ఎన్. చెన్నకిష్టయ్య, పి. బాలకృష్ణయ్య, ఎన్. పర్వతాలు, ఏ. మధు, ఎం. పృథ్వి రాజు, దాసరి బాలస్వామి, ఎన్. శంకరయ్య, కే. జనార్ధన్, కే. కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం- బొప్పిడి గోపాల్

**ఆమనగల్లు, అక్టోబర్ 13 (స్కై న్యూస్):** గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులది కీలక పాత్ర అని జిల్లా సర్పంచ్ ల సంఘం ఉపాధ్యక్షుడు బొప్పిడి గోపాల్ అన్నారు.మంగళవారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా సర్పంచ్ గోపాల్



తన సొంత నిధులతో నూతన దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు కష్టపడి సమాజ అభివృద్ధికి కీలక భూమిక వహిస్తున్నారని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమన్నారు. వారు ఎండనకా వాననకా రేయింబవళ్లు కష్టపడి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు.పండుగ సందర్భంగా వారికి దుస్తులు అందించడం ఎంతో సంతోషంగా ఉందని, వారి సంక్షేమానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్నారని, వారి కృషి వల్లనే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య, వార్డు సభ్యులు మంజుల, శోభ, బొగురమ్మ, నాయకులు రమేష్, శ్రీనివాస్, కర్నాజి, సాయికుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

**మెదక్ జిల్లా బీజేపీ నాయకులు సతీష్ పటేల్ డిమాండ్**

**మెదక్, అక్టోబర్ 13,(స్కై న్యూస్ ప్రతినిధి ):** మెదక్ తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం పాలనకు, రజాకార్లకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని మెదక్ జిల్లా బీజేపీ నాయకులు సతీష్ పటేల్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సతీష్ పటేల్ మాట్లాడుతూ.. భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం పోరాడి, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన చాకలి ఐలమ్మ





విగ్రహాన్ని ధ్వంసం చేయడం తీవ్రంగా బాధాకరమని అన్నారు. ఈ ఘటన మెదక్ పట్టణ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు.మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మెదక్ పట్టణంలోని అన్ని మహనీయుల విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సతీష్ పటేల్ డిమాండ్ చేశారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాలు శ్రీ అన్నపూర్ణాదేవిగా వాసవి మాత

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 13 (స్కై న్యూస్):** సకల ప్రాణికోటికి జీవనాధారం అన్నం. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. ఈ రూపంలో అమ్మ రసపాత్రను ధరించి దర్శనమిస్తుంది. ఆధిభిక్షువైన ఈశ్వరుడికి భిక్షపెట్టిన దేవత అన్నపూర్ణాదేవి. ఈమెను ధ్యానిస్తే మేధాశక్తి వృద్ధి చెందుతుంది. మధుర భాషణం, సమయస్ఫూర్తి, వాక్ సిద్ధి, శుద్ధి, భక్తిశ్రద్ధలు, ఐశ్వర్యం కలుగుతాయి. దసరా సార్ నవరాత్రి ఉత్సవాలలో మల్లకల్ శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి దేవాలయంలో మూడవరోజు వాసవి మాతను శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం



ఆధ్వర్యంలో హోమం నిర్వహించగా వేద పండితులు చైతన్య వేదమంత్రాలతో హోమం నిర్వహించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు రవి ఆచారి ప్రద్యుమ్న లు నిర్వహించడం జరిగింది.మానవుణ్ణి సకల సంపూర్ణుడిగా ఈ దేవి అనుగ్రహిస్తుంది. ప్రపంచ సృష్టి పోషకురాలు ‘ అమ్మ ‘ అనే అంతరార్థం ఈ అవతారంలో కనిపిస్తుంది. అమ్మ ధరించిన రసపాత్ర అక్షయ శుభాలను అందిస్తుంది. బుద్ధి, జ్ఞానాలను ఈ తల్లి వరంగా ఇస్తుంది. అనంతరం సాయంత్రం కుంకుమార్చన నిర్వహించగా పలువురు మహిళలు పాల్గొని అమ్మవారి సేవలో తరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రతినిధులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈరోజు పూజా దాతలు గణేకల్ వీరేష్ అండ్ సన్స్ మల్దకల్, చిందుకూరి సోమశేఖర్ అండ్ సన్ ఆరగిద్ద, చిందుకూరి రాఘవేంద్ర అండ్ సన్ ఆరగిద్ద, ఆళ్లగడ్డ ప్రకాష్ అండ్ సన్స్ ఉలిగేపల్లి, చవ్వా రాములు అండ్ బ్రదర్స్ పార్ చర్ల నిర్వహించారు. అనంతరం పూజా దాతలకు సన్మానం చేయడం జరిగింది.

## అడహక్ కమిటీతో హక్కుల సాధనకు పోరాటాలు

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 13( స్కై న్యూస్)** ఎం ఈ ఎఫ్ ఆధ్వర్యంలో హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించేందుకు అడ హక్ కంపెనీ ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరపాగ ప్రభాకర్ అన్నారు మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జాతీయ అదనపు కార్యదర్శి గాలి యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు అనంతరం ఏర్పాటుచేసిన కమిటీలో జిల్లా కన్వీనర్ గా కాళ్ల ప్రసాద్ ను ఎన్నుకోవడంతోపాటు నాలుగు డివిజన్లకు కో



కన్వీనర్లను ఎన్నుకున్నారు. నాగర్ కర్నూల్ డివిజన్ కో కన్వీనర్ గా మిద్దె సైదులు అచ్చంపేట డివిజనల్ కోకన్వీనర్ గా వెంకటయ్య కల్వకుర్తి కోకన్వీనర్ గా భాస్కర్ కొల్లాపూర్ లక్ష్మయ్య లను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్ నరసింహులు పరుశురాం లక్ష్మణ్ నాగభూషణం తిరుపతయ్య పాండు ఎల్లయ్య మహేష్ తదితరులు పాల్గొన్నారు

## క్రమబద్ధీకరణతోపాటు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 13 స్కై న్యూస్.:** గ్రామాలలో వైద్య సేవలు అందిస్తున్న ఎన్ హెచ్ ఎం సిబ్బందిని క్రమబద్ధీకరించడంతోపాటు మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మంజూరు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు మంగళవారం ఎన్ హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలను చేపట్టారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2022 నుండి పెండింగ్లో ఉన్న ఐదు శాతం వార్షిక ఇంక్రిమెంట్ను ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ ను చెల్లించాలని కోరారు. సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం ప్రతి ఉద్యోగికి క్యాడర్ పిక్సేషన్ అమలుచేసి 100% వేతనాన్ని చెల్లించాలని కోరారు. అవుట్సోర్సింగ్ ఏజెన్సీలను రద్దుచేసి ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ రాష్ట్ర హెల్త్ సొసైటీలోనే కొనసాగించి నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఇతర శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు మహిళా సిబ్బందికి కేడర్ తో సంబంధం లేకుండా ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ఉద్యోగి మరణించినట్లయితే వారి కుటుంబానికి 20 లక్షల ఎక్స్గ్రేషియా జీవిత బీమాతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఈ హెచ్ ఎస్ ఈ ఎస్ ఐ సౌకర్యాన్ని కల్పించాలని జీవో నెంబర్ 60 మరియు 1195 ప్రకారం తక్షణమే పెంచిన వేతనాలను చెల్లించాలని పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ మహతి డాక్టర్ పిఎన్ వి బాలకృష్ణ బాలకృష్ణ ప్రవీణ్ కుమార్ రేనయ్య అనంత చారి సంధ్య సాయి శంకర్ తోపాటు వీర శాఖలలో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు

## మూలమల్ల గ్రామానికి బిటి రోడ్డు రహదారి కి నిధులు ఇవ్వండి ....

**ప్రజావాణిలో నోడల్ అధికారికి గ్రామ సర్పంచ్ రంగారెడ్డి మరియు గ్రామస్తులు వినతి పత్రం అందజేత**




**ఆత్మకూర్ అక్టోబర్ 13 ( స్కై న్యూస్) ఆత్మకూరు** మండల పరిధిలో మూల మల్లగ్రామానికి బీటీ రోడ్డు నిధులు మంజూరు చేయాలని నోడల్ అధికారిగా వినతి పత్రం ఇవ్వడం జరిగింది అయితే గత పాలకులు రెండుసార్లు అధికారం చలయించిన మూలమల్ల గ్రామానికి మాత్రం రోడ్డు విస్తరణ పనులకు నోచుకోలేదు అయితే ఇప్పుడు ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో అయినా రోడ్డు విస్తరణ పనులు జరుగుతాయని గ్రామస్తులు ఆశించి అధికారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది గ్రామస్తులు ముళ్ళమళ్ళ గ్రామానికి సరైన బిటి రోడ్డు లేకపోవడంతో ప్రజలు రాకపోకలు సమయంలో తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుంది అధికారులు ఇప్పటికైనా మూలమల్ల గ్రామాన్ని దృష్టిలో ఉంచుకొని నిత్యం రద్దీగా ఉండే రహదారి ఆత్మకూర్ టు గద్వాల రహదారి అంత గుంతలమయంతో ఉండడంతో వాహన చోదకులు మరియు మరి ఆర్టీసీ బస్సులు మరియు అలాగే విద్యార్థి స్కూల్ బస్సులు రోడ్డుపై ప్రయాణించాలంటే చాలా ఇబ్బందిగా గురయ్య పరిస్థితి దీనంగా తయారైంది అందుకనే అధికారులు ములమల్ల గ్రామాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది అత్యవసర సమయంలో వైద్య సేవలు పొందేందుకు కూడా రహదారి ఇబ్బందిగా ఉందనితెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగారెడ్డి మరియు షరీఫ్ ప్రవీణ్ కుమార్ టీ న్యూస్ రిపోర్టర్ తదితర వ్యక్తులు వినతి పత్రం అందజేయడం జరిగింది

## నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 13( స్కై న్యూస్)** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్టించిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి మునిసిపల్ శాఖ నుండి క్రేన్ ఏర్పాటు చేయడంతో పాటు కేసరి సముద్ర పరిసరాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వివిధ మండపాల నిర్వాహకులు కోరారు మంగళవారం మునిసిపల్ చైర్మన్ తీగల సునింద్ర కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంలో వివిధ ప్రాంతాలలో విగ్రహాలను ఏర్పాటు చేసి అంగరంగ వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకువచ్చారు ప్రతి సంవత్సరం విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని కేసరి సముద్రంలో నిర్వహించడం జరుగుతుందని ప్రస్తుత పూజలు అనంతరం నిమజ్జనానికి తరలి వెళ్లే విగ్రహాలకు మరియు నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రస్తుతం నీటిమట్టం తక్కువగా ఉన్నందున నిమజ్జనానికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వాటిని తొలగించేందుకు క్రేన్ ఏర్పాటు చేయాలని కోరారు

## గుండా మల్లేష్ జీవితం స్ఫూర్తి దాయకం



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 13( స్కై న్యూస్)** కార్మిక కర్షక పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాటాలు నిర్వహించిన దివంగత ఎమ్మెల్యే గుండా మల్లేష్ జీవితం పేద ప్రజలకు స్ఫూర్తిదాయకమని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్ జి అన్నారు మంగళవారం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు వంకేశ్వరం శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని లక్ష్మీనాచారి భవనంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు పర్యాయాలు బెల్లంపల్లి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ప్రజాసేవలో నిరంతరం పరితపిస్తూ ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించి అణగారిన వర్గాల హక్కుల కోసం కృషి చేశారని కొనియాడారు. దళితుల ఆత్మగౌరవం సామాజిక న్యాయం సమానత్వం కోసం దళిత హక్కుల పోరాట సమితి ని ఏర్పాటు చేసి వ్యవస్థాపక అధ్యక్షులుగా దళిత ఉద్యమానికి విశేష సేవలు అందించాలని వివరించారు. అంబేద్కర్ ఆశయాలకు కమ్యూనిస్టు భావాజాలం ప్రజా ఉద్యమాల ద్వారా ముందుకు సాగిన ఆయన కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహించారని తెలిపారు ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కోశాధికారి రామస్వామి నాయకులు విష్ణు భూపేష్ శేఖర్ బాల పిరు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# దళిత కుటుంబం పై దౌర్జన్యం...

## ఎమ్మెల్యే మెగా రెడ్డి. మేనమామ వెంకట్రాంరెడ్డి పై ఆరోపణలు

**ఆత్మకూర్ వనపర్తి అక్టోబర్ 13 (స్కైన్యూస్ )** భారత రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించిన గుడి గోపురం నీడలో ఇంకా కుల వివక్ష రోజుకు పా తుక్కకపోతుంది దేవుడి ముందు అందరూ సమానమే అని చెబుతున్న దళితులపై ఆరోపణలు తగ్గడం లేదు ఈ రోజుల్లో కూడా దళితులనే మాటలు ఇంకా అక్కడక్కడ వినబడుతూ వాళ్ల మీద అరాచకాలు చేస్తూ గొడవలకు దిగుతున్నటువంటి వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి ఈ ఘటన వనపర్తి జిల్లాలోని ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి సొంత గ్రామంలో పెద్దమందడి మండలం మంగళంపల్లి లో చోటుచేసుకున్నది ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి మంగళంపల్లి గ్రామంలో ఆలయ పునర్నిర్మాణం జరుగుతూ వేల మాసాని సుధీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి దేవుడి దగ్గరకు దర్శనానికి వెళ్లారు దర్శనం చేసుకొని వస్తుంటే గ్రామ పెద్దలు అడ్డుకొని దౌర్జన్యానికి పాల్పడ్డారని బాధితుడు ఆరోపిస్తున్నాడు ఈ దాడికి ఎమ్మెల్యే మెగా రెడ్డి వెంకట్రాంరెడ్డి నాయకత్వం వహించారని సుధీర్ అనే వ్యక్తి ఆరోపణలు చేశారు

**"మేము మనుషులం కాదా"**

గ్రామంలో మాదిగలు అంటే ఎందుకింత చిన్నచూపు మేము చావుల దగ్గర డప్పు కొట్టడానికే చెప్పులు కుట్టడానికే ఎలక్షన్లో ముందు ఓట్లు వేయడానికి మాత్రమే పనికొస్తామా పోయినంత కాలం మాకు బానిస బతుకు లేనా అంటూ మాసాని సుదీర్ ప్రశ్నించారు దళితుడికి ఇంత అవమానం అంటూ ఆయన వ్యక్తం చేశారు ఇకనైనా మాదిగ బిడ్డల్లారా మేల్కొండి మాదిగ అంటే చెప్పులు కుట్టడమే కాదు రాజ్యాంగాన్ని ఏలేవాలమని మరొకసారి గుర్తు చేశారు పోరాడితే పోయేది బానిస సంకెళ్లు తప్ప ఏం లేదు ఎమ్మెల్యే సొంత ఊర్లోనే ఇలా జరుగుతే నియోజకవర్గం లో దళితుల పరిస్థితి ఏంటని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఎస్పీ జోక్యం చేసుకొని విచారణ జరిపించి నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు దళిత సంఘాలు

# మున్సిపల్ శాఖలో కొంతమంది అధికారుల బదిలీలు, పోస్టింగులపై పునఃసమీక్షించాలి

**ముఖ్యమంత్రికితెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్.తాజ్ మొహన్ రెడ్డి విజ్ఞప్తి**



**హైద్రాబాద్ అక్టోబర్ 13:**మున్సిపల్ శాఖలో కొంతమంది అధికారుల బదిలీలు, పోస్టింగులపై పునఃసమీక్షించాలనితెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్.తాజ్ మొహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ముఖ్యమంత్రి రెవెంత్ రెడ్డికి లేఖ రాశారు.నేను తెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించిన కొన్ని విషయాలను దృష్టికి తీసుకువస్తున్నానని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మమత జోనల్ కమిషనర్గా శేరిలింగంపల్లి, కూకట్పల్లి తదితర ప్రాంతాల్లో పనిచేయడంతో పాటు, అంతకుముందు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో కూడా పనిచేశారు. ఆ సమయంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మా సంఘం దృష్టికి వచ్చింది.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మమత ని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేయడం జరిగింది. అయితే, ఆ బదిలీ అమలులో ఉన్న సమయంలోనే ఆమె అమెరికాకు వెళ్లి, సుమారు ఆరు నెలల తరువాత తిరిగి భారతదేశానికి వచ్చారు. అనంతరం తిరిగి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్లో అసిస్టెంట్ డైరెక్టర్గా విధుల్లో చేరినట్లు మా దృష్టికి వచ్చింది.అదేవిధంగా, మహేందర్ గతంలో కేటీఆర్ ఓఎస్డీగా పనిచేసిన సమయంలో పలు అక్రమాలు, అవినీతి వ్యవహారాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. అవినీతి ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అనంతరం ఆయనను ఖమ్మం ప్రాంతానికి బదిలీ చేయడం జరిగింది. అయితే, ఇటీవల ఆయనను తిరిగి ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్కు సంబంధించిన ముఖ్యమైన పదవిలో నియమించడం పట్ల తెలంగాణ మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.కావున, పై రెండు బదిలీలు మరియు తదనంతర పోస్టింగులను తమరు దయచేసి పునఃసమీక్షించి, అవసరమని భావించిన పక్షంలో సంబంధిత అధికారులను దూర ప్రాంతాలకు బదిలీ చేయవలసిందిగా మా సంఘం తరఫున హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేసారు.తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాలను, వారి సంక్షేమాన్ని మరియు శాఖలో పారదర్శకమైన, క్రమశిక్షణతో కూడిన పరిపాలనను కాపాడేందుకు తమరు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

# రాజ్యాంగ సంస్థలను అప్రతిష్ట పాలు చేయడమే కాంగ్రెస్ నైజం..

**ఓటమి భయంతోనే ఓటు చోరీ డ్రామాలు!**

**ప్రజాస్వామ్య వ్యవస్థలపై కాంగ్రెస్ దాడిఎన్నికల్లో వరుస ఓటములతో దేశ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ..**




**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 13(స్కై న్యూస్):**గద్వాల పట్టణంలోని డికె.బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.లి కేంద్ర ఎన్నికల సంఘం (జజుజ) అత్యంత పారదర్శకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ **(SIR)** ప్రక్రియపై రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు కేవలం వారి రాజకీయ దివాళాకోరతనానికి నిదర్శనం అని అన్నారు.. సుప్రీంకోర్టు తీర్పును కూడా గౌరవించరా? అని ఈ **SIR** ప్రక్రియ అంతా చట్టబద్ధంగా, నిబంధనల ప్రకారమే జరుగుతోందని మే 27, 2026 న గౌరవ సర్వోన్నత న్యాయస్థానం **(Supreme Court)** స్పష్టమైన తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టే ఈ ప్రక్రియ చెల్లుబాటు అవుతుందని చెప్పిన తర్వాత కూడా, కాంగ్రెస్ పార్టీ ఇంకా అబద్ధాలను ప్రచారం చేయడం అంటే న్యాయవ్యవస్థను సైతం అవమానించడమే అవుతుందని అన్నారు..కాంగ్రెస్ పార్టీకి ఒక రాష్ట్రంలో ఒక నీతి, ఢిల్లీలో ఒక నీతి ఉంటుందా? కేరళలో వారి సొంత హోంమంత్రే '»**SIR** ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు మరియు అక్రమ ఓటర్లను తొలగించడానికి వీలవుతుంది" అని అంగీకరించారు. తెలంగాణ, కర్ణాటక, కేరళ వంటి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇదే వ్యవస్థ ద్వారా ఎన్నికలు జరిగితే ఒప్పుకుంటారు.. కానీ వారు ఓడిపోయే రాష్ట్రాల్లో మాత్రం ఎన్నికల సంఘంపై నిందలు వేస్తారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అని అన్నారు..అక్రమ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఎందుకు ఉలిక్కిపడుతోందని దేశ భద్రతకు ముప్పుగా మారిన అక్రమ చొరబాటుదారుల ఓట్లను, బోగస్ ఓట్లను తొలగించడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదు. ఎందుకంటే ఆ బోగస్ ఓట్లే వారి రాజకీయాధారం. నిజమైన ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా, బూత్ లెవల్ అధికారులు నేరుగా ఇళ్లకు వెళ్లి డాక్యుమెంట్లు సేకరిస్తారని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇంత పారదర్శకమైన ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు అడ్డుకోవాలని చూస్తోంది అని ప్రశ్నించారు. తెలంగాణలో ఈ ప్రక్రియను విజయవంతం కాకుండా చూసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది.ఎం కాంగ్రెస్ పార్టీ మరియు రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు, ఎన్నికల సంఘానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని అన్నారు..దేశవ్యాప్తంగా 124 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సరు చట్టబద్ధ ప్రక్రియలో పాలుపంచుకుంటూ ఓటర్ల జాబితా శుద్ధీకరణను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు.ఓటర్ల జాబితాలో అక్రమాలను తొలగించే ఈ మంచి ప్రక్రియను తప్పుబడుతూ, కాంగ్రెస్ నేతలు ఇది తప్పు ప్రక్రియ అని నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు. ?దేశవ్యాప్తంగా ఉన్న మేధావులు, ఇంటలెక్చువల్స్ అందరూ ఈ సరు ప్రక్రియ మంచిదేనని చెబుతుంటే, కాంగ్రెస్ నేతలు మాత్రం తమ అనవసర ఆలోచనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.కాబట్టి, కాంగ్రెస్ నేతలు వెంటనే తమ తప్పుడు ప్రచారాలను మానుకోవాలని, ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతున్న ఈ మంచి ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నాలు ఆపాలని అన్నారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు,జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, శ్యామ్, రాష్ట్రమహిళా అధికార ప్రతినిధి అక్కల రమాదేవి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,జిల్లా యువమోర్చ అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా మహిల మోర్చా అధ్యక్షురాలు సమత మధుగౌడ్ ,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, కౌన్సిలర్లు శాలన్న, చంద్రశేఖర్, మహిళా మోర్చా నాయకురాలు కుంటల మాధవి, భారతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు..

# రాజ్యాంగ బద్ధ సంస్థలను బజారుకిడుస్తున్న ఇండి కూటమి

**కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్**



**నారాయణపేట అక్టోబర్ 13( స్కైన్యూస్):**ప్రతి ఎన్నికల్లో ఓటమి చెందుతున్న కాంగ్రెస్ ఇండి కూటమి రాజ్యాంగ బద్ధ సంస్థలపై దాడులు నిర్వహిస్తున్నాయి అని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారం అందని వద్రాక్షగా మిగలడంతో అక్కసుతో పార్లమెంట్ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ విచ్ఛిన్నకర శక్తులతో కలిసి ఆందోళన చేస్తున్నారని ఆరోపించారు.

సుప్రీంకోర్టు అంటే కూడా

**రాహుల్ గాంధీరేవంత్ రెడ్డి**

ఎంపీగా ఎన్నికైనప్పటికీ రాహుల్ గాంధీకి ఇంకా రాజకీయ పరిపక్వత రాలేదని విమర్శించారు. నిన్నటి ఎస్ ఐ ఆర్ వ్యతి రేక ర్యాలీసుప్రీం కోర్టు వైపు వెళ్లడం తెలియజేస్తుంటే, ఆయనకంటే ఎక్కువ అనుభవం ఉన్న కాంగ్రెస్ ముఖ్య మంత్రులు రేవంత్ రెడ్డి డీకే శివకుమార్ రాహుల్ గాంధీ తోక పట్టుకొని సుప్రీంకోర్టుకు వెళ్లడం చూస్తుంటే వారి రాజకీయ అనుభవం ఎక్కడ పోయిందో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి కోతి పనులు చేసే రాహుల్ గాంధీ తన తప్పు డు వ్యాఖ్యానాలపై తప్పుడు పద్ధతులపై సుప్రీంకోర్టు చేత గతంలో అనేకసార్లు మొట్టికాయలు తిన్న సంగతి ఇంకా ప్రజానీ కం మరువలేదన్నారు. అయినప్పటికీ విదేశీ నిధుల చేత భారత దేశాన్ని కబలించే సోరోస్ నిధుల చేత డీప్ సేథ్ శక్తుల చేత నడిపించబడుతున్న ఓటు చోరీ" వ్యతిరేక ఆందోళన గురించి సుప్రీం కోర్టు ఇప్ప టికే చాలా స్పష్టమైన అభిప్రాయాలను వెల్లడిం చిందనీ తెలిపారు.మామూలు వ్యక్తిని మొద లుకొని ప్రతిపక్ష నాయకుని వరకు ప్రతి ఒక్కరికి కోర్టు తలుపులు తెరిచే ఉంటా యని కోర్టు పద్ధతి ప్రకార మే రావాలని సూచించిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో భారత న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉంచి పిటిషన్ ల ద్వారా ఈ సమస్య పరిష్క రించుకోవాలన్న ద్యాస లేదా అని అన్నారు. ప్రజాభి మానం కోల్పోయిన తరునా ఇండికూటమి నాయకుల ప్రవర్తన ముందే కోతి ఆపై కల్లు తాగింది అన్న చందాన మారిందనీ విమర్శించారు.రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వ్యతిరేకంగా ఆందోళన చేస్తే వారికి ఒరిగేదేమి ఉండదనీ తెలిపారు. ఇండి కూటమి సి జే ఐ చెప్పిన విధంగా కోర్టు కు వెళ్లాలని, సుప్రీం కోర్టుకు ర్యాలీలు తీసుకు వెళ్లడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఇలాంటి పొర పాటు చేసినందుకు ఇండి కూటమి కూటమి నాయకు లందరూ సుప్రీంకోర్టుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

## ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్, అక్టోబర్ 13,(స్కై న్యూస్ ప్రతినిధి ):** మెదక్ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో వర్షపాతం పరిస్థితులు, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగు, విత్తనాల సరఫరా తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు, చెరువులు, ఇతర నీటి వనరులపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అన్ని శాఖలు సమన్వయంతో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులు వరి సాగుపైనే ఆధారపడకుండా కంది, మొక్కజొన్న, పెసలు, మినుములు, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగు వైపు మళ్లేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా తక్కువ నీటి వినియోగంతో మెరుగైన ఆదాయం పొందే అవకాశాలను రైతులకు వివరించాలని తెలిపారు.వరి సాగుతో కలిగే లాభనష్టాలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, కనీస మద్దతు ధరలపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటల విత్తనాల లభ్యతపై ప్రత్యేక దృష్టి**

ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన విత్తనాల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ, సోయాబీన్, జొన్న, సజ్జ తదితర పంటల విత్తనాలకు సంబంధించిన సబ్సిడీ వివరాలతో సమగ్ర ప్రొఫార్మాను సిద్ధం చేయాలని తెలిపారు.మండలాలు, గ్రామాల వారీగా రైతుల నుంచి విత్తనాల డిమాండ్‌ను సేకరించి, అవసరమైన విత్తనాల సరఫరా కోసం ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని సూచించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అమలు చేయాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రాబోయే రెండు రోజుల్లోగా సిద్ధం చేయాలని ఆదేశించారు.వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, నీటిపారుదల తదితర శాఖలు తమ పరిధిలోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలతో నివేదికలు అందించాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ నోడల్ శాఖగా వ్యవహరిస్తూ అన్ని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు.మార్కెట్ అవకాశాలు, మద్దతు ధరలపై రైతులకు అవగాహన కల్పించాలి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసే పంటలు, వాటికి వర్తించే మద్దతు ధరలు, కొనుగోలు విధానం తదితర అంశాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ, మండల స్థాయి అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వ్యవసాయంతో పాటు నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర రంగాలపై ప్రభావాన్ని అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. రబీ సాగుకు ముందుగానే తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్, జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు, నీటిపారుదల డివిజన్ల ఈఈలు, జిల్లా పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేట ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

## 3.5 కిలోల బరువున్న రొమ్ము గడ్డ తొలగించిన డాక్టర్లు




**నారాయణపేట,అక్టోబర్13(స్కైన్యూస్):**నారాయణపేట జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో మంగళవారం డాక్టర్లు అరుదైన శాస్త్ర చికిత్స విజ యవంతంగా నిర్వహించా రు.అరుదైన ఫిలోడ్స్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు.గురుమిత్కాల్ గ్రామానికి చెందిన శంకరమ్మ గత ఎనిమిది సంవత్సరాలుగా కుడివైపు రొమ్ములో గడ్డతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఆమె నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ని సందర్శించగా, వైద్యులు పరీక్షించి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చుకున్నా రు.మంగళవారం ఉదయం జనరల్ సర్జరీ విభాగం వైద్య బృందం ఆమెకు విజ యవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ శస్త్ర చికిత్సలో 3.50 కిలోల బరువున్న గడ్డను తొలగిం చి, తదుపరి పరీక్షల నిమి త్తం బయాప్సీ పరీక్షకు పంపించారు. పరీక్షల ఫలి తాల ఆధారంగా గడ్డ స్వభా వాన్ని నిర్ధారించనున్నారు.ఈ శస్త్రచికిత్సలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఆదిత్య డాక్టర్ వినీల డాక్టర్ రత్న, డాక్టర్ రహీం, డాక్టర్ వివేక్ పాల్గొన్నారు. అనస్థీషియా విభాగం నుంచి డాక్టర్ నీలవర్ణ, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సాయికుమార్ సేవలందించారు. స్టాఫ్ నర్సులు ప్రవళిక, స్వప్న, కిరణ్, గోపి శస్త్రచికిత్సకు సహకరించారు.ఈ సంద ర్భంగా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ కె. సంపత్ కుమార్ సింగ్ మాట్లా డుతూ, నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుప త్రిలో అనుభవజ్ఞులైన వైద్య బృందం సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడం పట్ల వైద్య బృందా న్ని అభినందించారు.

# ఘనంగా ముగిసిన అండర్ 14 కుస్తీ పోటీలు

## ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచిన పాలమూరు

## జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి

## డి ఈ ఓ గోవిందరాజు



**నారాయణపేట అక్టోబర్ 13 (స్కైన్యూస్):**గత మూడు రోజులుగా నారాయణపేట జిల్లా దామరదిద్ద మండలం కానుకుర్తి గ్రామ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో అండర్ 14 లెవెల్ రెజ్లింగ్ పోటీలో ముగిసా యి.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా హాజరైన డి ఈ ఓ గోవింద రాజు, పాఠ శాల ప్రధానోపా ధ్యాయురాలు అన్నపూర్ణ అధ్యక్షతన కార్యక్రమం ముగిసింది.ఈ సందర్భంగా ఈ ఓ మాట్లాడుతు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచిపేరు తీసుకొని రావాలి అని అన్నారు. నారాయణపేట జిల్లా చదువులతో పాటు ఆటలలో చాలా ముందు ఉన్నాము,జిల్లా కలెక్టర్ ప్రోద్బలంతో జిల్లాలో రెజ్లింగ్ కు ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తున్నామని, రెజ్లింగ్ ఆటలో పాలమూరు జిల్లా తరుపున నారాయణపేట జిల్లా క్రీడాకారులు నాలుగు గోల్డ్,నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించి మన జిల్లా పేరు నిలబెట్టారు అని అన్నారు.అండర్ 14 రెజ్లిం గ్ లో 20 కేటగిరీలో పోటీ లు నిర్వహించారు ఇందు లో విజయం సాధించిన వారు ఈనెల 30నుండి న్యూఢిల్లీ త్యాగరాజు స్టేడి యంలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటా రని నారాయణపేట జిల్లా ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ తెలిపారు. పోటీలో విజేత లకు మెడల్స్ మరియు బహుమతులను ముఖ్య అతిథులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, కానుకుర్తి గ్రామ సర్పంచు ఎన్ నారాయ ణ,ఉప సర్పంచ్ యశోద, దామరదిద్ద సింగిల్ విండో చైర్మన్ఈదప్ప,నారాయణపేట మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ సదాశివరెడ్డి, మండల విద్యాశాఖ అధి కారి సురేష్,విద్యాశాఖ కార్యాలయ అధికారులు నాగార్జున రెడ్డి,విద్యాసా గర్, యాదయ్య,సంగీత లు,ఎస్ జి ఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా సెక్రటరీ వేణుగోపాల్,రెజ్లింగ్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నర్సిములు,మండలం లోని సర్పంచులు,వ్యాయమ ఉపాధ్యాయులు వెంకట ప్ప, రామకృష్ణ రెడ్డి,బాల రాజ్ గౌడ్,రవి కుమార్, నెల్సన్,సాయినాథ్,బీరప్ప,నర్సింహారెడ్డి,బాలరాజు,నర్సింహారె డ్డి,కోచ్ శ్రీనివాస్, రాజేష్, బస్వరాజు, మండలంలోని వివిధ పార్టీల నాయకులు కాను కుర్తి గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆలయానికి రక్షణ కల్పించండి....

## హిందువుల మనోభావాలను గౌరవించండి

## ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సంపత్ కుమార్ మాదిగ



**హైదరాబాద్ అక్టోబర్ 13** 'అపరిశుభ్రతల మధ్య అమ్మవారి ఆలయం' అనే శీర్షికతో పలు దినపత్రికలోసోమవారం వచ్చిన వార్త కతనాలపై ఎమ్మార్పీఎస్ నాయకులు సంపత్ కుమార్ మాదిగ స్పందించారు. ఆయన కాచిగూడ స్టేషన్ సమీపంలో గల అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైల్వే శాఖ డబ్బులకు ఆశపడి పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం కొరకు అక్కడ ఉన్న గుడిని కూల్చివేసే ప్రయత్నం చేశారని దానిని గమనించిన స్థానికులు అడ్డుకొని రక్షణ కల్పించారని టిలిపారు. అక్కడ గత కొన్ని సంవత్సరాలుగా చిన్న అమ్మవారి గుడి ఉందని కూడా చూడకుండా చుట్టూ ఉన్న ప్రహరీ గోడను కూల్చివేసారని తెలిపారు.దీంతో అక్కడ గంజాయి సేవించే వారు ప్రయాణికులు గుడి ఆవరణలో మలమూత్రాలు విసర్జించడం చాలా బాధ కలిగించిందని సంపత్ కుమార్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రైల్వే శాఖ అధికారులు అమ్మవారి గుడికి చుట్టూ ప్రహరీ గోడను నిర్మించి రక్షణ కల్పించి హిందువుల మనోభావాలను గౌరవించాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో శేఖర్, తిరుపతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు

# కార్మికుల హక్కులు సాధించడంలో ఎంప్లాయిస్ యూనియన్ ముందుంటుంది



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 13 (స్కై న్యూస్):**ఆర్టీసీ లో పనిచేసే కార్మికుల హక్కులు సాధించడంలో ఎంప్లాయిస్ యూనియన్ ముందుంటుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేశ్వరయ్య, అధ్యక్షులు గాల్ రెడ్డి కార్యదర్శి గిరిరాజులు తెలిపారు. మంగళవారం గద్వాల ఆర్టీసీ డిపో లో కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ను గెలిపించినందున కృతజ్ఞతాపూర్వకంగా సమావేశం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ బస్సు డిపో ముందు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి ఎంప్లాయిస్ యూనియన్ గెలుపు పట్ల ప్రతి కార్మికుడికి యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంప్లాయిస్ యూనియన్ పోటీ చేసి గెలుపొందడం జరిగిందని రెండు చోట్ల మాత్రం ఇతర యూనియన్ వచ్చిందని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ జరుగుతుందని ప్రతి కార్మికుడి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తమ యూనియన్ కష్టపడుతుందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ సమైక్య కూటమి విజయం సాధించడం పట్ల కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికులకు ఎర్రజెండా అండగా ఉంటుందని అన్నారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాక్షులు పరమేశ్వరయ్య డిపో అధ్యక్షులు గాల్ రెడ్డి కార్యదర్శి గిరిరాజు సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, భాస్కర్, శ్రీధర్ రావు మాజీ జిల్లా కార్యదర్శి బసన్న ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ వీర రీజనల్ నాయకురాలు కవిత నవీన్ కుమార్ రామన్న రంగన్న తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ సమస్యపై సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక దృష్టి

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25వ జాబ్ డ్రైవ్ విజయవంతం

## 600 మందికి పైగా హాజరు.. 347 మంది ఇంటర్వ్యూ ప్రక్రియ పూర్తి



**ఆమనగల్లు, అక్టోబర్ 13(స్కై న్యూస్):**గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, యువతీ యువకులు, మహిళలకు వారి విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్‌లు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆమనగల్‌లోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన 25వ జాబ్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి 600 మందికి పైగా నిరుద్యోగ యువత హాజరుకాగా, 347 మంది ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తి చేశారు.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ జాబ్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఉద్యోగ ఖాళీలను గుర్తించడం, అర్హులైన అభ్యర్థులకు ఆ అవకాశాలను చేరువ చేయడం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆయన కృషి చేస్తున్నారు.గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంలో కృషి అభినందనీయం.ఈ సందర్భంగా జాబ్ డ్రైవ్‌లో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ, కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామీణ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ, అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పరిచయం చేయడం ద్వారా నిరుద్యోగులకు మంచి వేదిక కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం**

ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, తమ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, మహిళలు ఉద్యోగాలు పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడం ఐక్యత ఫౌండేషన్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. మహిళలు ఉపాధి పొందడం ద్వారా కుటుంబ ఆదాయానికి తోడ్పడటంతో పాటు, ఆత్మవిశ్వాసంతో స్వతంత్రంగా జీవించే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది యువతకు ప్రతిభ, అర్హతలు ఉన్నప్పటికీ సరైన ఉద్యోగ అవకాశాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన అన్నారు. అలాంటి యువతకు కంపెనీల ద్వారా ఉపాధి అవకాశాలను చేరువ చేసి, వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ యువతలో ప్రతిభకు కొరత లేదు. వారికి సరైన అవకాశాలు, మార్గదర్శకత్వం అందితే తమ భవిష్యత్తును తామే నిర్మించుకోగలరు. అందుకే కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ ఉద్యోగ అవకాశాలను యువతకు చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు.నిరుద్యోగ యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించేలా జాబ్ డ్రైవ్‌లను కొనసాగిస్తామని తెలిపారు. యువతీ యువకులతో పాటు మహిళలు కూడా ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంతో పాటు, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందిస్తూ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా ఐక్యత ఫౌండేషన్ కృషి కొనసాగిస్తుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ కంపెనీ హెచ్ ఆర్ హెడ్ నిక్ పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్స్ కంపెనీ మేనేజర్ వీర, హెచ్ ఆర్ మహేష్, సోర్సింగ్ పార్టనర్ ఎల్ ఎన్ కౌశిక్, వివిధ కంపెనీల ప్రతినిధులు జగన్, లక్ష్మణ్, పావని, శిరీష, నితీష్‌లతో పాటు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, చంద్రశేఖర్, కొండల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరితనం కేవలం ఒక భావోద్వేగ సమస్య మాత్రమే కాదు



**వికారాబాద్ అక్టోబర్ 13;** భౌతికముగా అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ఆప్యాయంగా మాట్లాడే మనిషి లేకపోవడం, తమ మాట వినే వారు లేకపోవడం, కుటుంబ సభ్యులతో సమయం గడప లేకపోవటం వంటి కారణాలు వారిని మానసికంగా కృంగదీస్తున్నాయని దీనికోసమే ప్రభుత్వం వారు డే కేర్ సెంటర్లను నిర్వహిస్తున్నారని దీన్ని ప్రతి ఒక్క వృద్ధులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి కోరారు. ఒంటరితనం కేవలం ఒక భావోద్వేగ సమస్య మాత్రమే కాదు. అది ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎక్కువ కాలం ఒంటరిగా ఉండే వృద్ధుల్లో ఆందోళన, నిరాశ, నిద్రలేమి, జ్ఞాపకశక్తి సమస్యలు పెరిగే అవకాశం ఉందని సాయి చౌదరి తెలిపారు. కొన్నిసార్లు ఇది శారీరక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుందని, మనసుకు సంతోషం లేకపోతే శరీర ఆరోగ్యం కూడా క్షీనిస్తుందని, అందుకే వృద్ధుల మానసిక ఆరోగ్యం పై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని వీటి కోసమే జిల్లాలో డే కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నారని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని సాయి చౌదరి అన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమానికి టీపీసీసీ అబ్జర్వర్‌గా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, అక్టోబర్ 13(స్కై న్యూస్):** హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమానికి టీపీసీసీ అబ్జర్వర్‌గా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ, అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కసిరెడ్డి నారాయణరెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించడంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల నమోదు కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించనుంది.

## ఆసుపత్రులు, క్లినిక్‌లలో వైద్య సేవల

# ధరల పట్టికను ప్రదర్శించాలి

**మహబూబాబాద్, అక్టోబర్ 13: (స్కైన్యూస్ )**ఆసుపత్రులు, క్లినిక్‌లలో వైద్య సేవలు, వైద్య పరీక్షలు, చికిత్సలకు సంబంధించిన ధరల వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించడం రోగులకు ప్రయోజనం చేకూర్చే చర్య అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీ కాచ్వాల్ శ్యామసుందర్ శర్మ గారు, బీజేపీ జిల్లా నాయకులు డాక్టర్ ధరంసోత్ సీతారాం నాయక్ గారు పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి గౌరవ్ గ్రా.వా. శ్రీవాస్తవ 2026 అక్టోబర్ 12న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో వైద్య సేవలు, సదుపాయాలకు సంబంధించిన ధరల పట్టికను స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించే అంశంపై దృష్టి సారించాలని కోరినట్లు వారు తెలిపారు. వర్తించే నిబంధనల ప్రకారం వైద్య సేవల ధరల వివరాలను స్థానిక భాషతో పాటు ఆంగ్లంలోనూ ప్రదర్శించడం ద్వారా ప్రజలకు అవసరమైన సమాచారం సులభంగా అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, సామాన్య ప్రజలు ఆసుపత్రులకు వెళ్లినప్పుడు వైద్య పరీక్షలు, చికిత్సలు, ఇతర ఆరోగ్య సేవలకు ఎంత ఖర్చవుతుందో ముందుగానే తెలుసుకునే అవకాశం ఉండాలని పేర్కొన్నారు. వైద్య సేవలకు సంబంధించిన ధరల వివరాలను ఆసుపత్రులు, క్లినిక్‌లలో స్పష్టంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబ సభ్యులు చికిత్స ఖర్చులపై అవగాహన పెంచుకొని, తమ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. వైద్య బిల్లుల విషయంలో అపోహలు, గందరగోళం, వివాదాలు తగ్గించేందుకు కూడా ఈ చర్య దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలోని



కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడం, రోగుల ప్రయోజనాలను పరిరక్షించడం, వైద్య రంగంలో పారదర్శకతను బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడం అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని వారు కోరారు. ప్రజలు కూడా ఆసుపత్రులు, క్లినిక్‌లలో వైద్య సేవలు పొందే ముందు పరీక్షలు, చికిత్సలు, ఇతర సదుపాయాలకు సంబంధించిన ఛార్జీల వివరాలను అడిగి తెలుసుకోవాలని, చికిత్సకు సంబంధించిన బిల్లులు, చెల్లింపు రసీదులను భద్రపరచుకోవాలని సూచించారు. ధరల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే ఆసుపత్రి యాజమాన్యాన్ని వివరణ కోరాలని, అవసరమైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. వైద్య సేవల్లో పారదర్శకత పెరిగి, రోగులకు చికిత్స ఖర్చులపై స్పష్టమైన సమాచారం అందుబాటులోకి రావడం ప్రజారోగ్య వ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.

## కన్నుల పండుగగా గాయత్రీ దేవిగా

# వాసవి మాత దర్శనం...

**విశేషంగా సామూహిక పూజలు**

**అలరించిన సంస్కృతిక కార్యక్రమాలు**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 13( స్కై న్యూస్)** వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 56వ దేవీ శరన్నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా మంగళవారం మూడవరోజు వాసవి కన్యకా పరమేశ్వరి మాత గాయత్రీ మాత భక్తులకు దర్శనం ఇచ్చారు ఈ సందర్భంగా అశేషంగా హాజరైన దంపతులు ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు దంపతులచే అమ్మవారి ఉత్సవమూర్తికి విశేష అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు అనంతరం నిర్వహించిన గణపతి సుబ్రహ్మణ్యం ?యం దుర్గా సరస్వతి లక్ష్మీ హోమాలకు విశేషంగా దంపతులు పాల్గొన్నారు జోషి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల అనంతరం లఘు పూర్ణాహుతి నిర్వహించి మహా నిరాజనం



సమర్పించారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు బిల్లా కంటి హరిబాబు ఆలయ అధ్యక్షుడు మిడిదొడ్డి అంజయ్య తో పాటు తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ మచి పెద్ది శివకుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హకీం రాజేష్ తో పాటు వివిధ పార్టీల ఆర్యవైశ్య నాయకులు పట్టణ ఆర్యవైశ్య సంఘం మరియు విద్యా కమిటీ మహిళా సంఘం యువజన కమిటీ తోపాటు పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు అనంతరం సాయంత్రం నిర్వహించిన పూజా కార్యక్రమాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు బాదం రాధిక ఆధ్వర్యంలో దుర్గ భవాని బృందం చే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి అనంతరం పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన తంబోలా కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ఈ సందర్భంగా భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు

# ఆడ పిల్లను పుట్టనిద్దాం, బ్రతకనిద్దాం,ఎదగనిద్దాం

## బిసీఐటీయూ , వ్యాకస, నపర్డ్ ఆధ్వర్యంలో శ్రమిక బతుకమ్మ సంబరాలు .

**మెదక్, అక్టోబర్ 13,(స్కై న్యూస్ ప్రతినిధి ):**ఆడపిల్ల పుట్టడం భారంగా కాకుండా సంతోషంగా భావించాలని, బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, భద్రతతో పాటు సమాన అవకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం అన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవనంలో శ్రామిక బతుకమ్మ సంబరాలు ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నప్పటికీ, ఇంకా ఆడపిల్లల పట్ల వివక్ష కొనసాగడం ఆందోళనకరమని అన్నారు. ఆడపిల్లలపై వివక్షను రూపుమాపి, బాల్యవివాహాలను అరికట్టి, ప్రతి బాలిక చదువుకునేలా తల్లిదండ్రులు, సమాజం బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆడపిల్లలకు ఆత్మవిశ్వాసం కల్పించి, వారి ఆశయాలను ప్రోత్సహించినప్పుడే సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, మహిళల ఐక్యతకు ప్రతీక అని, శ్రమజీవి మహిళల జీవితాల్లో ఆనందాన్ని నింపడంతో పాటు మహిళల హక్కులు, గౌరవం, సమానత్వం గురించి చాటిచెప్పేలా శ్రమిక బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. “ఆడపిల్లను పుట్టనిద్దాం... బతకనిద్దాం... ఎదగనిద్దాం... సమాన హక్కులతో




సమాజంలో ముందుకు సాగనిద్దాం!” అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలమణి, కోశాధికారి నర్సమ్మ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, కడారి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె . మల్లేశం, నపర్డ్ నాయకులు దుర్గ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 13 (స్కై న్యూస్):**గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం కేంద్రంలో ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను పొందడం జరిగింది.

**శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం**

నుండి దేవరగట్టు వరకు రోడ్లు నిర్మాణానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం జరిగింది.

ముందుగా ఎమ్మెల్యే కి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యేని వేద పండితులు శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగబోయే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు దేవర గట్టుకు వెళ్లి స్వామిని దర్శించుకుని రావడానికి వీలుగా రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంతేగాక దాసంగాలు సమర్పించడానికి కూడా ఎంతో వీలుగా ఉంటుందని తెలిపారు.

**ఆలయ చైర్మన్ మాట్లాడుతూ**

ఎమ్మెల్యే సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, ఆలయ కమిటీ



వ్యవస్థాపక చైర్మన్ ప్రహల్లాద రావు, జిల్లా సీనియర్ నాయకులు సత్య రెడ్డి, సీతారాం రెడ్డి,మాజీ గ్రంథాలయ చైర్మన్ రామన్ గౌడ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, వైస్ చైర్మన్ విష్ణు, నాయకులు వెంకటన్న, శేషంపల్లి నర్సింహులు,పట్వారి అరవిందరావు, నరేందర్ మధు నాయకి, పరశురాముడు, తిమ్మరాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు మనసాని నాగరాజు, శ్రీనివాసులు, నాగరాజుయువ నాయకులు ప్రవీణ్ తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు వాల్మీకి పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా

# ఆమనగల్ ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## డీసీపీని కోరిన మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్

**ఆమనగల్లు, అక్టోబర్ 13(స్కై న్యూస్):**బతుకమ్మ, విజయదశమి దసరా పండుగలు మరియు జమ్మి పూజల సందర్భంగా ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు భద్రతా చర్యలు చేపట్టాలని ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్ డీసీపీని కోరారు. ఈరోజు తుక్కుగూడలో డీసీపీని మర్యాదపూర్వకంగా కలిసి, పండుగల సమయంలో పట్టణంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే వేడుకలు, జమ్మి పూజలు, రద్దీ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారుముఖ్యంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు ప్రశాంతంగా పండుగలను జరుపుకునేలా అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు చేయాలని వారు డీసీపీ




దృష్టికి తీసుకెళ్లారు. ఆమనగల్ ప్రజలు సంతోషంగా, సురక్షితంగా బతుకమ్మ, దసరా పండుగలను జరుపుకునేలా పోలీసు శాఖ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆమనగల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు కండే భాస్కర్ పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న పాదయాత్రను

# విజయవంతం చేయాలి...

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 13( స్కై న్యూస్)** బీసీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన రాజ్యాధికార పాదయాత్ర ఈనెల 15న సాయంత్రం ఐదు గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని బీసీ సంఘాలన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా బీసీ జేఏసీ సీనియర్ నాయకులు వెంకటస్వామి కాళ్ళ నిరంజన్ కుంభ0 మల్లేష్ గౌడ్ సత్య శిలాసాగర్ బీసీ జేఏసీ కన్వీనర్ శివశంకర్ యాదవ్ కో కన్వీనర్లు మల్లేష్ గౌడ్ లక్ష్మయ్య కోరారు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ హక్కుల సాధన కోసం సమానత్వం కోసం చేపట్టిన పాదయాత్ర జడ్చర్ల నుండి గొట్టం మీదుగా బిజినపల్లి మండల కేంద్రానికి చేరుకుంటుందని అదే రోజు సాయంత్రం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని వివరించారు. పాదయాత్రలో రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలను ఏకతాటి పైకి తీసుకువచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు రాజకీయ పార్టీలకతీతంగా బీసీలంతా ఐక్యంగా మద్దతు ఇవ్వాలని



కోరారు ఈ సమావేశంలో నాయకులు రాజేందర్ గౌడ్ లక్ష్మయ్య ఆంజనేయులు అరవింద చారి తిరుపతయ్య శరత్ శ్రీనివాసులు భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు



# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు

**ప్రజాసేవ, వృత్తిపరమైన నిబద్ధతపై సిబ్బందికి పోటీలు**

**మెదక్, అక్టోబర్ 13 ,(స్కైన్యూస్ ప్రతినిధి ):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీస్ సిబ్బందిలో ప్రజాసేవ పట్ల బాధ్యత, వృత్తిపరమైన నిబద్ధత, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగంపై అవగాహన పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్., తెలిపారు.కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు పనిచేస్తున్న సిబ్బందికి "ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు", "పోలీస్ అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర -- దాని దుర్వినియోగాన్ని నివారిస్తూ వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలకు



సద్వినియోగం చేసుకోవడం ఎలా?" అనే రెండు అంశాలను కేటాయించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన సిబ్బంది పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ వ్యాసాలను సమర్పించారు.ప్రజల పట్ల పోలీసుల బాధ్యతలు, ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల పాత్ర, సోషల్ మీడియాను సమాజ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని ఈ పోటీలు ప్రతిబింబిస్తున్నాయని ఎస్పీ పేర్కొన్నారు.అదేవిధంగా జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ విద్యా స్థాయికి అనుగుణంగా నిర్దేశించిన అంశాల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ పోటీలు పోలీస్ సిబ్బంది, విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంపొందిస్తాయని తెలిపారు.

# టార్గెట్ 100 గిగావాట్ పవర్



**న్యూఢిల్లీ :** వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. 2047 బ్లూ ప్రింట్ రెడీ చేసిన కేంద్రం.. దానికి తగ్గట్లుగా చర్యలు చేపడుతోంది. అభివృద్ధికి విద్యుత్ ముఖ్యం.. అది కూడా భారీగా కావాలి. అందుకు తగినట్లుగా అణువిద్యుత్ పై కేంద్రం ఫోకస్ పెట్టింది.2047 నాటికి దేశంలో 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రైవేట్ రంగానికి ద్వారాలు తెరిచినట్లు అణుశక్తి కమిషన్ చైర్మన్ అజిత్ కుమార్ మొహంతి వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రైవేట్ కంపెనీలు 7.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టి, 30 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయని పేర్కొన్నారు.ప్రస్తుతం భారత్‌లో 9 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, ప్రభుత్వ సంస్థ ఔఖఅఎఇ 24 రియాక్టర్లను నడుపుతోంది. మరో 17 రియాక్టర్ల నిర్మాణం జరుగుతోంది. అణురంగాన్ని వేగవంతం చేసేందుకు తెచ్చిన శాంతి చట్టంతో ప్రైవేట్ కంపెనీల ప్రవేశానికి మార్గం సుగమమైందని ఐదేళ్లలో ప్రైవేట్ సంస్థలూ రియాక్టర్లను నిర్వహిస్తాయని ంఇఅ తెలిపింది. ఒక మెగావాట్ అణు విద్యుత్ ఉత్పత్తికి 25 కోట్లు ఖర్చవుతుందని, ఉక్కు, సిమెంట్, భారీ పరిశ్రమల అవసరాలకు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల తయారీని ప్రభుత్వం పరిశీలిస్తోంది."ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' ప్రస్తుతం 24 రియాక్టర్లను నిర్వహిస్తోంది. ప్రైవేట్ సంస్థలు కూడా అణు విద్యుత్ రంగంలోకి రావాలని భావిస్తున్నాం. అందుకే కొత్తగా శాంతి చట్టాన్ని తీసుకువచ్చాం. రాబోయే ఐదేళ్లలో ఒకటి రెండు ప్రైవేట్ రంగ సంస్థలు రియాక్టర్లను నిర్వహిస్తాయని ఆశిస్తున్నాను. 2047 నాటికి వారి నుంచి సుమారు 30 ఉచి విద్యుత్ ఉత్పత్తి అవుతుందని మేము అంచనా వేస్తున్నాం. 1 ఓచి విద్యుత్ ఉత్పత్తికి సుమారు రూ. 25 కోట్ల ఖర్చు అవుతుంది" అని మొహంతి పేర్కొన్నారు.దేశీయ వనరైన థోరియంను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా భారత్ మూడంచెల అణు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది. మొదటి దశలో యురేనియం ఇంధనంగా వాడే రియాక్టర్లను ఉపయోగిస్తారు. ఇవి పనిచేస్తున్నప్పుడు విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు, ప్లూటోనియం-239ను కూడా ఉత్పత్తి చేయగలవు. వాడిన అణు ఇంధనాన్ని పునఃప్రక్రియ చేయడం ద్వారా దీనిని తిరిగి పొందవచ్చని మొహంతి అన్నారు. ఇలా తిరిగి పొందిన ప్లూటోనియంను ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ టెక్నాలజీ ఆధారంగా రెండో దశలో ఉపయోగిస్తారు. ఈ దశ అదనపు విచ్ఛిన్న పదార్థాల ఉత్పత్తికి మద్దతు ఇవ్వడానికి, చివరికి థోరియం వినియోగాన్ని సులభతరం చేయడానికి రూపొందించిందని అన్నారు. "మూడో దశలో థోరియంను అణు ఇంధనంగా ఉపయోగపడే విచ్ఛిన్న పదార్థంగా మార్చాలని భావిస్తున్నారు. థోరియంను ముందుగా తగిన విచ్ఛిన్న పదార్థంగా మార్చకుండా నేరుగా సంప్రదాయ రియాక్టర్ ఇంధనంగా ఉపయోగించలేరు. ఈ సాంకేతిక సవాలును అధిగమించి, దేశీయ వనరులను మరింతగా ఉపయోగించుకునే అణు ఇంధన చక్రానికి అంతిమంగా మద్దతు ఇవ్వడానికే భారత్ మూడు- దశల కార్యక్రమాన్ని రూపొందించింది." అని మొహంతి అన్నారు.మోనజైట్ కలిగిన సముద్రతీర ఇసుకతో ముడిపడిన థోరియం వనరులు భారతదేశంలో గణనీయంగా ఉన్నాయి. "ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో సహా తీర రాష్ట్రాల్లో సముద్రతీర ఇసుక ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. వాటి నుంచి మోనజైట్‌ను వెలికితీయవచ్చు. వాటి నుంచి సరైన ప్రక్రియ ద్వారా థోరియంను తిరిగి పొందవచ్చు. ప్రపంచ థోరియం నిల్వల్లో 25 శాతం భారతదేశంలోనే ఉన్నాయి." అని ఆయన తెలిపారు.ఈ క్రమంలో తమిళనాడులోని కల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ విజయవంతంగా క్రిటికాలిటీని సాధించింది. ఇది అందుబాటులోకి వస్తే రష్యా తర్వాత వాణిజ్య ప్రాతిపదికన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌ను నిర్వహిస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది.

# తెలుగు గంగ నీటిపై చర్చలు



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వస్తున్న తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పర్యటన తెలుగు, తమిళ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ప్రతిష్టాత్మక విజయవాడ ఉత్సవ్ 2.0 సాంస్కృతిక వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా విజయ్ విచ్చేస్తున్నప్పటికీ.. ఈ పర్యటనకు చాలా ప్రాధాన్యత ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో విజయ్ ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సీఎం విజయ్ ముఖాముఖి భేటీ కానున్నారు.ఈ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం తెలుగు గంగ నీటి పంపకాలు. చెన్నై నగర దాహార్తిని తీర్చేందుకు ఉద్దేశించిన చారిత్రక ఒప్పందం ప్రకారం తమిళనాడుకు సరైన కోటాలో కృష్ణా జలాలు అందడం లేదన్న అసంతృప్తి చెన్నై వర్గాల్లో బలంగా ఉంది. కండలేరు రిజర్వాయర్ నుంచి పూండికి చేరాల్సిన నీటి పరిమాణంలో ఏర్పడుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి అడ్డంకులు, కాల్వల నిర్వహణ, బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ఉన్నత స్థాయి సమావేశం వేదిక కానుంది. తమిళనాడు ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం విజయ్ ఏపీ ప్రభుత్వాన్ని కోరనుండగా.. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కాంక్షించే చంద్రబాబు సైతం దీనిపై సానుకూల రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించే అవకాశముంది.నీటి సమస్యలతో పాటు ఈ భేటీకి అత్యంత బలమైన జాతీయ రాజకీయ ప్రాధాన్యత కూడా ఉంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న వేళ.. ప్రతిపాదిత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయన్న భయం నెలకొంది. ఈ కీలక అంశంపై దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కేంద్రంతో సమన్వయం చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రయత్నాలు సాగిస్తున్నారు. విజయ్-చంద్రబాబుల చర్చల్లో డీలిమిటేషన్ అంశం ప్రధాన ఎజెండాగా మారనుందని, దక్షిణాది రాజకీయ స్వరాన్ని ఢిల్లీ వేదికగా బలంగా వినిపించేందుకు ఒక ఉమ్మడి కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకునే వీలుందని భావిస్తున్నారు.ఇద్దరు సూపర్ స్టార్లు విజయ్ ? పవన్ కల్యాణ్ భేటీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సినిమా రంగంలో అగ్ర హీరోలుగా వెలుగొంది, ప్రజా సమస్యలపై పార్టీలను స్థాపించి ఎన్నికల సమరంలో విజయం సాధించిన ఈ ఇద్దరు నాయకుల ఆలోచనలు, సిద్ధాంతాలు, దక్షిణాది యువత సాధికారత అంశాలు ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే వీలుంది. అటు సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొంటూనే, ఇటు కీలకమైన అంతర్రాష్ట్ర వివాదాలు, జాతీయ రాజకీయ సమీకరణాలపై విస్తృత చర్చలు జరపడం ద్వారా సీఎం విజయ్ అమరావతి పర్యటన సరికొత్త సమీకరణాలకు నాంది పలికేలా కనిపిస్తోంది.

## ప్రశాంతంగా నైపుణ్య శిక్షణ ఫైనల్ పరీక్షలు



**మహబూబ్‌నగర్ అక్టోబర్ 13(స్కైన్యూస్ )** మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలకు అందిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణ కోర్సులకు సంబంధించిన ఆరవ బ్యాచ్ తుది పరీక్షలు విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. పరీక్షలను సెట్విన్ అధికారులు, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఇన్‌ఛార్జ్ నిజలింగప్ప తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ., నిరుద్యోగ మహిళల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించడమే ఈ శిక్షణ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారతకు, ఉపాధి అవకాశాల మెరుగుదలకు ఇటువంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ పరీక్షల నిర్వాహకులు హాజీ అలీ, సరిత, అజిమత్ ఉన్నీసా, లత తదితరులు పాల్గొన్నారు.

## నవ్వించిన నైవేద్యం



**హైద్రాబాద్ అక్టోబర్ 13:**సినీ రచయిత యం.వి.ఎస్. హరనాథ రావు, వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ.. జయా ఆర్ట్స్ హైదరాబాద్, లలిత కళా పరిషత్ అనంతపురం సంయుక్త నిర్వహణలో నైవేద్యం నాటికను ప్రదర్శించారు. ఆకలితో ఉన్న పేదవాడికి పిడికెడు మెతుకులు కూడా పెట్టించలేని మానవత్వం, దానిని ఆపలేని దైవత్వం మధ్య నడిచే కథాంశంతో ప్రేక్షకులను అలరించింది. అందరినీ కడుపుబ్బా నవ్వించి, అనంతరం ఆలోచింప జేసింది. ఇప్పటివరకు 45 నాటికలకు దర్శకత్వం వహించిన శ్రీజ 46 వ నాటికగా తనకు తనకు ఎంతో ఇష్టమైన ఈ నాటికకు దర్శకత్వం వహించడం సంతోషంగా ఉండడమే కాదు, హరనాథ రావు కి నివాళి అర్పించడమే అన్నారు.లలిత కళా పరిషత్ సెక్రటరీ గాజుల పద్మజ ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, నాటిక ప్రదర్శనను విజయవంతం చేశారు. సినీనటులు, రంగస్థల దర్శకులు వెంకట్ గోవాడ ఈ కార్యక్రమానికి అతిధిగా హాజరయ్యారు. అనంతరం దర్శకురాలు శ్రీజ సాదినేనిని ఘనంగా సత్కరించారు.

## మాగనూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గా పుంజానూరు సురేష్



**నారాయణపేట అక్టోబర్ 13: (స్కైన్యూస్)** మాగనూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గా పుంజ నూరు సురేష్ (ఆంధ్రప్రభ)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులు గౌరవ అధ్యక్షులుగా లక్ష్మణ్ ప్రహ్లాద్ రెడ్డి, ప్రధాన కార్యద ర్శి బాలరాజ్ కార్యదర్శి గా కథలప్ప కోశాధికారి శ్రీనివాసులు,ఉపాధ్యక్షులు నరేష్ శివ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను ఘనంగా సన్మానించారు.అనంతరం అద్యక్షుడు సురేష్ మాట్లాడుతూ విలేకరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.విలేకరులకు ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డుల కోసం ఐక్యంగా కృషి చేస్తానని తెలిపారు.ఈ సమావేశంలో మండలంలోని విలేకరులు పాల్గొన్నారు.

## డిండి లిఫ్ట్ ప్రాజెక్టును రద్దు చేసి పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

**- ఉమ్మడి పాలమూరు జేఏసీ డిమాండ్ - 17న కల్వకుర్తిలో మహా ధర్నాకు పిలుపు**



**ఆమనగల్లు, అక్టోబర్ 13(స్కై న్యూస్):**రైతులకు నష్టం చేకూర్చే డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వెంటనే రద్దు చేసి, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఛైర్మన్ రాజేందర్ రెడ్డి, కన్వీనర్ రాఘవాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆమనగల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాలమూరు జిల్లా రైతుల చిరకాల స్వప్నమైన పెండింగ్ ప్రాజెక్టులను పక్కన పెట్టి, కొత్తగా డిండి లిఫ్ట్ ప్రాజెక్టును తీసుకురావడం సరికాదని అన్నారు.ఈనెల 17వ తేదీన కల్వకుర్తి తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో తలపెట్టిన మహా ధర్నాను రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు, నాయకులు సదానంద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## వెండి భారీ పతనం.. అసలు కారణం ఇదే!




సాధారణంగా బంగారం, వెండి అంటే చాలామందికి ఇష్టం. కొందరు ఆభరణాల కోసం కొనుగోలు చేస్తే.. మరికొందరు భవిష్యత్తులో మంచి లాభాలు వస్తాయనే ఆశతో పెట్టుబడులు పెడుతుంటారు. అయితే, గత కొంతకాలంగా బంగారంతో పోలిస్తే వెండి ధరలు భారీగా పడిపోతున్నాయి. దీంతో వెండిలో పెట్టుబడి పెట్టినవారు ఆందోళన చెందుతున్నారు. గతంలో మంచి రాబడులు ఇచ్చిన వెండి ఇప్పుడు ఎందుకు తగ్గుతోంది? అసలు ధరల పతనానికి కారణాలేంటి? అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**అందుకే వెండికి డిమాండ్**

వెండిని మనం సాధారణంగా ఆభరణాలు, పూజా సామగ్రి, పట్టీలు, మెట్టెలు, దేవుడి విగ్రహాలు, గ్లాసులు వంటి వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటాం. అయితే.. వెండికి డిమాండ్ పెరగడానికి ఇవే ప్రధాన కారణాలు కావు. పారిశ్రామిక రంగంలో కూడా వెండిని విస్తృతంగా వినియోగించడంతో వెండికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ చిప్‌లు, డేటా సెంటర్లు వంటి రంగాల్లో వెండి కీలక పాత్ర పోషిస్తుంది. వెండికి విద్యుత్‌ను సమర్థవంతంగా ప్రసారం చేసే లక్షణం ఉండటంతో అనేక ఎలక్ట్రానిక్ పరికరాల్లో దీన్ని ఉపయోగిస్తారు. అందువల్ల పారిశ్రామిక రంగంలో డిమాండ్ పెరిగినా, తగ్గినా వెండి ధరలపై ప్రభావం పడుతుంది. అంతర్జాతీయ మార్కెట్లలో జరిగే మార్పులు కూడా వెండి ధరలను ప్రభావితం చేస్తాయి.

**బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం**

ఇటీవల బంగారం, వెండి ధరల మధ్య వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర సుమారు 3 శాతం తగ్గగా, వెండి ధర ఏకంగా 16 శాతం పడిపోయింది. గత ఆరు నెలల్లో వెండి 20.14 శాతం, గత నెలలో 8.14 శాతం తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. పరిశ్రమల్లో వెండి వినియోగం తగ్గితే.. భవిష్యత్తులో వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంటుందని పెట్టుబడిదారుల్లో ఆందోళన కలుగుతోంది. అమెరికా డాలర్ బలపడటం కూడా వెండి ధరలను ప్రభావితం చేయవచ్చు. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి సాధారణంగా డాలర్లలో ట్రేడవుతుంది. డాలర్ బలపడినప్పుడు ఇతర కరెన్సీలు ఉపయోగించే కొనుగోలుదారులకు వెండి ఖరీదుగా మారే అవకాశం ఉంటుంది. దీంతో డిమాండ్‌పై ప్రభావం పడవచ్చు.

**ఈ రోజు వెండి ధరలు**

వెండి రేటు గత వారం రోజులుగా స్థిరంగా ఉంది. దీంతో కేజీ సిల్వర్ ధర హైదరాబాద్, విజయవాడలలో రూ.2.45 లక్షల వద్ద ఉంది. ఢిల్లీలో కేజీ వెండి రేటు రూ.2.40 లక్షల వద్ద ఉంది.

# ఆన్‌లైన్ షాపింగ్ జోరు..

## 48 గంటల్లో రూ.24,000 కోట్ల సేల్స్!



దసరా, దీపావళి వంటి పండుగల సీజన్ వచ్చిందంటే చాలు.. కొత్త బట్టలు, స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు లాంటి వస్తువులు కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తారు. ముఖ్యంగా.. ఆన్‌లైన్‌లో భారీ డిస్కౌంట్లు, బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ డీల్స్ అందుబాటులో ఉండటంతో షాపింగ్ చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈసారి కూడా పండుగల సేల్స్‌లో ఇదే ట్రెండ్ కనిపిస్తోంది. ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలు ప్రారంభించిన సేల్స్‌కు వినియోగదారుల నుంచి భారీ స్పందన లభించింది. కేవలం 48 గంటల్లోనే (రెండు రోజుల్లో) ఏకంగా రూ.24,200 కోట్ల విలువైన వస్తువులు అమ్ముడైనట్లు రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ నివేదిక వెల్లడించింది.

**రెండు రోజుల్లోనే..**

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, జియో వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో పండుగల సేల్స్ ప్రారంభం కావడంతో ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంది. రెడ్‌సీర్ నివేదిక ప్రకారం.. మొదటి రెండు రోజుల్లోనే దేశవ్యాప్తంగా సుమారు 6 కోట్ల నుంచి 6.5 కోట్ల మంది వినియోగదారులు ఈ సేల్స్‌లో పాల్గొన్నారు. వీరు మొత్తం 8 కోట్ల నుంచి 9 కోట్ల వరకు ఆర్డర్లు చేసినట్లు అంచనా. సాధారణ రోజుల్లో జరిగే వ్యాపారంతో పోలిస్తే ఈ రెండు రోజుల్లో నమోదైన అమ్మకాలు సుమారు ఆరు రెట్లు ఎక్కువగా ఉండటం విశేషం. అంటే, పండుగల సమయంలో ఆన్‌లైన్ షాపింగ్‌కు ప్రజలు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు.. నిత్యావసరాలు, ఇతర వస్తువులను తక్కువ సమయంలో ఇంటికి చేర్చే క్విక్ కామర్స్ సేవలకు కూడా డిమాండ్ పెరిగింది. ఈ విభాగంలో సాధారణ రోజులతో పోలిస్తే నాలుగు నుంచి ఐదు రెట్లు అధిక వ్యాపారం నమోదైనట్లు నివేదిక పేర్కొంది.

**స్మార్ట్‌ఫోన్ సేల్స్ ఇలా**

ఈ పండుగల సేల్స్‌లో స్మార్ట్‌ఫోన్లు అత్యధిక అమ్మకాలు సాధించిన ఉత్పత్తులుగా నిలిచాయి. కొత్త ఫోన్లు కొనుగోలు చేయాలనుకునేవారికి భారీ డిస్కౌంట్లు, పాత ఫోన్లపై ఎక్స్ఛేంజ్ ఆఫర్లు అందుబాటులో ఉండటంతో చాలామంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. నివేదికలో వెల్లడైన.. మొత్తం అమ్మకాల్లో స్మార్ట్‌ఫోన్ల వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉంది. వీటి విలువ సుమారు రూ.9,100 కోట్ల నుంచి రూ.9,600 కోట్లుగా అంచనా వేశారు.

**గృహోపకరణాలకు డిమాండ్**

స్మార్ట్‌ఫోన్ల తర్వాత కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు మంచి అమ్మకాలను నమోదు చేశాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు వంటి వస్తువులను కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపించారు. ఈ విభాగం మొత్తం అమ్మకాల్లో 25 నుంచి 27 శాతం వాటాను దక్కించుకున్నట్లు నివేదిక అంచనా వేసింది. వీటి అమ్మకాల విలువ సుమారు రూ.6,000 కోట్ల నుంచి రూ.6,500 కోట్ల వరకు ఉంది.

**ఫ్యాషన్ ఉత్పత్తుల సేల్స్**

కొత్త బట్టలు, చెప్పులు, ఇతర ఫ్యాషన్ ఉత్పత్తుల కొనుగోళ్లు కూడా జోరుగా సాగాయి. మొత్తం అమ్మకాల్లో.. ఫ్యాషన్ విభాగం 15 నుంచి 18 శాతం వాటాను పొందినట్లు అంచనా. ఈ విభాగం ద్వారా.. సుమారు రూ.3,630 కోట్ల నుంచి రూ.4,350 కోట్ల విలువైన అమ్మకాలు జరిగినట్లు నివేదిక పేర్కొంది. ముఖ్యంగా తక్కువ ధరల్లో అందుబాటులో ఉండే ఫ్యాషన్ దుస్తులకు చిన్న పట్టణాల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది.

**చిన్న పట్టణాల్లోనూ కూడా..**

గతంలో ఆన్‌లైన్ షాపింగ్ ఎక్కువగా మెట్రో నగరాలకే పరిమితమై ఉండేది. కానీ ఇప్పుడు టైర్-2 నగరాలు, చిన్న పట్టణాల్లోనూ ఈ-కామర్స్ వినియోగం పెరుగుతోంది. ఇంటి వద్దకే వస్తువులు డెలివరీ కావడం, ధరలను పోల్చి చూసుకునే అవకాశం ఉండటం, ఆన్‌లైన్ ఆఫర్లు అందుబాటులో ఉండటం ఇందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

## గ్రీన్ కార్డు ప్రోగ్రామ్ సస్పెన్షన్‌పై స్పందించిన ఇన్ఫోసిస్




ఇంటర్నెట్ డెస్క్: అర్హులైన విదేశీ కార్మికులకు గ్రీన్‌కార్డు కోసం కంపెనీలు స్పాన్సర్ చేయడానికి వీలు కల్పించే పర్మ్ కార్యక్రమం నుంచి అమెరికా తమను సస్పెండ్ చేయడంపై ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ స్పందించింది. ఈ నిర్ణయం తమ కార్యకలాపాలపై గణనీయమైన ప్రభావం చూపదని భావిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపనీ వెల్లడించింది. 'ట్రంప్ సర్కారు పర్మ్ ప్రోగ్రాం నుంచి ఇన్ఫోసిస్‌ను సస్పెండ్ చేసింది. ఇది కంపెనీ కార్యకలాపాలపై పెద్దగా ప్రభావం చూపదని భావిస్తున్నాం. అమెరికాలో సాంకేతికతకు, ఆవిష్కరణలకు, స్థానిక ఉద్యోగాల నియామకాలకే కంపెనీ పెట్టుబడులు పెడుతోంది. అమెరికాలో వర్తించే నిబంధనలకు, చట్టాలన్నింటికీ కట్టుబడి ఉన్నాం" అని ఇన్ఫోసిస్ తెలిపింది. హెచ్-1బీ వీసా ఉద్యోగులకు గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కంపెనీలను అనుమతించే పర్మినెంట్ లేబర్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ (పర్మ్) నుంచి మైక్రోసాఫ్ట్, టాటా, ఇన్ఫోసిస్, విప్రో సహా మొత్తం 8 దిగ్గజ ఐటీ కంపెనీలను అమెరికా సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, గత కొన్నేళ్లుగా భారత ఐటీ కంపెనీల గ్రీన్ కార్డు దరఖాస్తులను గణనీయంగా తగ్గించినట్లు టెక్ వర్గాలు చెబుతున్నాయి. యూఎస్ ఆర్థిక సంవత్సరం-26లో టీసీఎస్ కేవలం 2 పర్మ్ దరఖాస్తులు మాత్రమే సమర్పించడం గమనార్హం.

# మూడో టీ20లో భారత్ థ్రిల్లింగ్ విక్టరీ
## సిరీస్‌లో 2-1 ఆధిక్యం

**మూడో టీ20లో వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం**
**14 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌లో 2-1 ఆధిక్యం**
**విరుచుకుపడ్డ అభిషేక్ శర్మ (69), ఇషాన్ కిషన్ (37)**
**మూడు వికెట్లతో రాణించిన అర్ష్‌దీప్ సింగ్**



ఈ నెల 14న హైదరాబాద్‌లో ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 ఇండోర్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటర్లు, ఆ తర్వాత బౌలర్లు సమష్టిగా రాణించడంతో భారత్ గెలుపొందింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగుల భారీ స్కోరు సాధించి ఆలౌటైంది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (30 బంతుల్లో 69; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతనికి ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 37) తోడవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఆ తర్వాత తిలక్ వర్మ (28), నితీశ్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) కూడా కీలక పరుగులు జోడించడంతో భారత్ భారీ స్కోరు చేయగలిగింది. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, షమార్ స్ప్రింగర్, షమార్ జోసెఫ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. 224 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో వెస్టిండీస్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ షాయ్ హోప్ (5)ను అర్ష్‌దీప్ సింగ్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేర్చాడు. అయితే, షిమ్రాన్ హెట్మెయర్ (43), కమిల్ పూరన్ (42) దూకుడుగా ఆడి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో విండీస్ లక్ష్యానికి దూరమైంది. చివర్లో షమార్ స్ప్రింగర్ (11 బంతుల్లో 35 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3 వికెట్లతో సత్తా చాటగా, నమన్ ధీర్ 2 వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో ఒక జట్టు లక్ష్యాన్ని కాపాడుకోవడం ఇదే తొలిసారి. మ్యాచ్‌కు మంచు ప్రభావం పెద్దగా లేకపోవడం భారత బౌలర్లకు కలిసొచ్చింది. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఈ నెల 14న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో జరగనుంది.

## ఆ 'నలుగురు కలిసి' 600 వికెట్లు.. ఆసీస్ బౌలర్ల సరికొత్త చరిత్ర!



ఆస్ట్రేలియా ప్రఖ్యాత బౌలింగ్ చతుష్టయం టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. పేసర్లు పాట్ కమ్మిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లైయన్‌లతో కూడిన ఈ బృందం.. కలిసి ఆడిన టెస్టుల్లో 600 వికెట్లు పడగొట్టిన తొలి బౌలింగ్ బృందంగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. దక్షిణాఫ్రికాతో దర్బన్‌లోని కింగ్స్‌మీడ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ అరుదైన ఘనతను అందుకుంది. ఈ టెస్టు ప్రారంభానికి ముందు ఈ నలుగురు బౌలర్లు కలిసి 37 టెస్టుల్లో 599 వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు పడగొట్టడం ద్వారా తమ 38వ టెస్టులో 600 వికెట్ల మైలురాయిని దాటారు. ఈ 38 మ్యాచుల్లో కమ్మిన్స్ అత్యధికంగా 160 వికెట్లు పడగొట్టగా, స్టార్క్ 155, హాజిల్‌వుడ్ 152, లైయన్ 140 వికెట్లతో తమ వంతు పాత్ర పోషించారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే బృందంగా ఆడుతూ 600 వికెట్ల మైలురాయిని దాటిన తొలి బౌలింగ్ చతుష్టయం ఇదే కావడం విశేషం. వీరి తర్వాత రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్‌కు చెందిన జేమ్స్ అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్, బెన్ స్టోక్స్, మొయిన్ అలీల చతుష్టయం 34 టెస్టుల్లో కలిసి 433 వికెట్లు మాత్రమే తీసింది. దీన్నిబట్టి ఆసీస్ బౌలర్ల ఆధిపత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత మ్యాచ్ విషయానికొస్తే, తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు మాట్ రెన్షా సెంచరీతో 390 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను ఈ నలుగురు బౌలర్లు కట్టడి చేశారు. కమ్మిన్స్ మూడు వికెట్లు తీయగా, హేజిల్‌వుడ్, లైయన్ చెరో రెండు వికెట్లు, స్టార్క్ ఒక వికెట్ పడగొట్టారు. దీంతో దక్షిణాఫ్రికా 197 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

# స్పోర్ట్స్

## మరోసారి చెలరేగిన ఫర్హాన్, సదాకత్.. పాక్ ఘన విజయం



స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను పాక్ మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో గెలిచిన ఆతిథ్య జట్టు.. ఇవాళ జరిగిన రెండో మ్యాచ్‌లో 82 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో చెలరేగిన పాక్ ఆటగాళ్లు సాహిబ్‌జాదా ఫర్హాన్, మాజ్ సదాకత్ రెండో మ్యాచ్‌లోనూ విజృంభించారు. తొలి మ్యాచ్‌లో తృటిలో సెంచరీ మిస్ (89) చేసుకున్న ఫర్హాన్ రెండో టీ20లోనూ భారీ అర్ధ సెంచరీ సాధించాడు. తొలి మ్యాచ్‌లో మెరుపు అర్ధ సెంచరీ (50) చేసిన మాజ్ సదాకత్ రెండో టీ20లో నాలుగు పరుగుల తేడాతో (96) సెంచరీని చేజార్చుకున్నాడు. ఫర్హాన్, సదాకత్ చెలరేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. పాక్ ఇన్నింగ్స్‌లో ఫకర్ జమాన్ (22), హసన్ నవాజ్ (19 నాటౌట్) కూడా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. లంక బౌలర్లలో తీక్షణ, ఎషాన్ మలింగ, షనక తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక చేతులెత్తేసింది. 74 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన ఆ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 7 వికెట్ల నష్టానికి 133 పరుగులు మాత్రమే చేయగలిగింది. పాక్ బౌలర్లలో ఇమ్రాన్ రంధవ (4-0-11-3) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. సల్మాన్ మిర్జా 2, సైమ్ అయూబ్, షాదాబ్ ఖాన్ తలో వికెట్ పడగొట్టారు. ఈ సిరీస్‌లోని నామమాత్రపు చివరి టీ20 అక్టోబర్ 13న జరగనుంది.

# రొటీన్ సినిమాలకు చెక్ పెట్టి కొత్త ప్రయోగాలు చేస్తున్న కిరణ్ అబ్బవరం!



యువ నటుడిగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం ఇప్పుడు జోరు పెంచారు. వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, తాజాగా తన అప్‌కమింగ్ ప్రాజెక్టులకు సంబంధించి ఎన్నో ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. ఒకవైపు కమర్షియల్ హంగులతో పాటు, మరోవైపు సరికొత్త జోనర్లలో నటిస్తూ తన కెరీర్‌ను పరుగులు పెట్టిస్తున్నారు. గతంలో వచ్చిన 'మీటర్' సినిమా ఫ్లాప్ కావడం తనకెంతో నేర్పించిందని, రొటీన్ కథలను ప్రేక్షకులు ఆదరించరనే సత్యాన్ని ఆ సినిమా ద్వారా గ్రహించానని కిరణ్ ఓపెన్‌గా చెప్పారు. ఇకపై ప్రతి విషయంలోనూ ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'రియాలిటీ' మధ్యతరగతి యువకులు పెళ్లి విషయంలో ఎదుర్కొనే ఒత్తిళ్లు, తక్కువ బడ్జెట్‌లో వివాహం చేసుకోవాలనుకునే కుర్రాడి కష్టాల ఆధారంగా ఈ సినిమా వినోదాత్మకంగా రానుంది. డిసెంబర్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా డిజిటల్ వరల్డ్‌లోకి కూడా అడుగుపెడుతున్నారు కిరణ్. 'డియర్ కామ్రేడ్' ఫేమ్ భరత్ కమ్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గువ్వల చెరువు ఘాట్' అనే వెబ్ సిరీస్‌తో ఆయన ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్నారు. 1980ల నాటి రాజకీయ నేపథ్యంతో ఎనిమిది ఎపిసోడ్లుగా రూపొందుతున్న ఈ సిరీస్‌లో ఆయన జర్నలిస్ట్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక భారీ చిత్రాల విషయానికొస్తే.. 'కాంతార: చాప్టర్-1'కి పని చేసిన శ్రీకాంత్ పుప్పాల డైరెక్షన్‌లో 'ఇంద్రపుత్ర' సినిమా చేస్తున్నారు. ఇది పీరియాడిక్ డ్రామా కాదని, కేవలం తొలి 15 నిమిషాలు మాత్రమే మైథలాజికల్ టచ్ ఉండే నేటి తరపు కథ అని ఆయన క్లారిటీ ఇచ్చేశారు. అలాగే తనే స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తున్న 'హతః' అనే హారర్ థ్రిల్లర్ సినిమా ప్రేక్షకులను సీట్ల అంచున కూర్చోబెట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మొత్తానికి వైవిధ్యమైన కథలతో కిరణ్ అబ్బవరం చేస్తున్న ఈ కొత్త ప్రయోగాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

# కామ్రేడ్ కల్యాణ్ మూవీ.. రెండో రోజు ఊహించని కలెక్షన్స్..!




శ్రీ విష్ణు హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ కామ్రేడ్ కల్యాణ్. ఈ చిత్రంలో మహిమ నంబియార్ హీరోయిన్ నటించింది. ఈ సినిమాకు జానకీరామ్ దర్శకత్వంలో తెరకెక్కించారు. ప్రస్తుతం ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. మొదటి రోజు పాజిటివ్ టాక్ రాకపోయినప్పటికీ.. వసూళ్లపరంగా రాణించింది. మొదటిరోజు రూ.4.5 కోట్ల గ్రాస్ కలెక్షన్ వచ్చినట్లు వెల్లడించారు. అయితే రెండో రోజు ఈ చిత్రం వసూళ్లపరంగా దూసుకెళ్లింది. ఫస్ట్ డే కేవలం రూ.4.5 కోట్లు మాత్రమే రాబట్టిన ఈ మూవీ.. రెండో రోజు ఊహించని కలెక్షన్స్ సాధించింది. శనివారం ఒక్కరోజే రూ.8 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. రెండో రోజుల్లో కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.12 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్.

కామ్రేడ్ కల్యాణ్ కథేంటంటే..

'కామ్రేడ్ కళ్యాణ్' విషయానికొస్తే 90వ దశకంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం. ఓ మాదిరిగా చదువుకున్న తాడికొండ కళ్యాణ్ (శ్రీవిష్ణు).. ఊరిలో ఓ థియేటర్‌ని లీజుకు తీసుకుని నడిపిస్తుంటాడు. అప్పుడే అక్కడి అడవుల్లో నక్సలైట్ దళాల ఏరివేత కోసమని ప్రత్యేకంగా ఐపీఎస్ అధికారి జార్జ్‌కుట్టి (షైన్ టామ్ చాకో) వస్తాడు. మాస్టార్ (సాయిచంద్) దళానికీ, జార్జ్‌కుట్టీకి మధ్య యుద్ధం కొనసాగుతుండగానే, ఆ ఊరిలోకి ఒరియా అమ్మాయి సితారదేవి (మహిమా నంబియార్) తన తల్లిదండ్రులతో కలిసి వస్తుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన తల్లి సరస్వతమ్మ (రాధికా శరత్‌కుమార్)ని కాపాడిన సితారని చూసి తొలి చూపులోనే కళ్యాణ్ ప్రేమలో పడతాడు. ఆమెతో కలిసి జీవితాన్ని పంచుకోవాలనుకుంటాడు. సితార కోసం చేసిన కొన్ని పనుల వల్ల థియేటర్‌ని నడిపే కళ్యాణ్.. కామ్రేడ్ కళ్యాణ్ అవుతాడు. పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా మారిపోతాడు. అడవిలోని అన్నలకు, కళ్యాణ్‌కు సంబంధమేంటి? తన ప్రేయసి సితార కుటుంబాన్ని కష్టాల నుంచి గట్టెక్కించాడా? సితార కుటుంబం కష్టాల్లో కూరుకుపోవడానికి కారణమేమిటి? అనేది మిగతా స్టోరీ.

# రవితేజ కొత్త సినిమా టైటిల్ ఖరారు.. 'తులాభారం'తో వస్తున్న మాస్ మహారాజా!




మాస్ మహారాజా రవితేజ, విభిన్న చిత్రాల దర్శకుడు వివేక్ ఆత్రేయ కలయికలో రాబోతున్న కొత్త సినిమా టైటిల్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రానికి 'తులాభారం' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఒక ప్రత్యేకమైన టైటిల్ డాక్యుమెంటరీని విడుదల చేసింది. ఈ వినూత్న ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వివేక్ ఆత్రేయ తనదైన శైలిలో కథను సిద్ధం చేయగా, రాక్‌స్టార్ వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. రవితేజ మార్క్ ఎనర్జీ, వివేక్ ఆత్రేయ సృష్టించే బలమైన పాత్రలు కలిసి ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజాగా విడుదల చేసిన 'తులాభారం' టైటిల్ డాక్యుమెంటరీ సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది. ఇందులో చిత్ర నిర్మాణం, నేపథ్యానికి సంబంధించిన కొన్ని విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియాంక మోహన్, అనశ్వర రాజన్ కథానాయికలుగా నటిస్తుండగా, జేడీ చక్రవర్తి, తరుణ్ భాస్కర్ కీలక పాత్రలు పోషించనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.

# ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' షూటింగ్‌పై క్రేజీ అప్‌డేట్.. నవంబర్ నుంచి కొత్త షెడ్యూల్ షురూ!



టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ అయిన 'డ్రాగన్' మూవీ కోసం యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి చిత్ర యూనిట్ నుంచి ఒక ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. గాయం నుంచి కోలుకుంటున్న తారక్ త్వరలోనే మళ్లీ సెట్స్‌లోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ చిత్రం కోసం ఒక భారీ సెట్‌ను ఇప్పటికే నిర్మించారు. నవంబర్ మొదటి వారం నుంచి ఈ సెట్‌లో 'డ్రాగన్' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్‌తో పాటు చిత్రంలోని ఇతర ప్రధాన తారాగణంపై కొన్ని కీలకమైన, ఉత్కంఠభరితమైన సన్నివేశాలను తెరకెక్కించనున్నారు. ఇదిలా ఉంటే, ప్రశాంత్ నీల్ సినిమాలలో ఇప్పటివరకు విజువల్స్ అన్నీ ప్రధానంగా డార్క్, బ్లాక్ అండ్ గ్రే షేడ్స్‌లో ఉండటం తెలిసిందే. అయితే, ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మాత్రం ఒక ప్రత్యేకత ఉండబోతోందని టాక్. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ పూర్తిగా కలర్‌ఫుల్‌గా, సరికొత్త విజువల్ వండర్‌లా సాగుతాయని ప్రచారం జరుగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, రాక్ స్టార్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. తారక్ కెరీర్‌లో మరో సరికొత్త మైలురాయిగా నిలవబోతున్న ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకూ తారాస్థాయికి చేరుకుంటున్నాయి.



# విజయ్ దేవరకొండ రుద్రతాండవం.. రణబాలిలో ఈ సాంగ్ చూశారా..?

తెలుగు సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'రణబాలి' ఒకటి. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్‌ను మరింత జోరుగా నిర్వహిస్తున్న మేకర్స్.. తాజాగా రెండో పాట 'కోబలి'ని విడుదల చేశారు.

**రణబాలి నుంచి రెండో పాట**

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన 'రణబాలి' అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ముందుగా స్పాటిఫైలో విడుదలైన 'కోబలి' పాట లిరికల్ వీడియోను తాజాగా యూట్యూబ్‌లోనూ విడుదల చేశారు. 'కోబలి' పాట పవర్‌ఫుల్‌గా సాగుతూ ఆకట్టుకుంటోంది. అర్థవంతమైన సాహిత్యం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అజయ్-అతుల్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమా విడుదలకు ముందు వచ్చిన ఈ రెండో పాటతో 'రణబాలి'పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగే అవకాశం ఉంది.

# ముగిసిన జంతర్ మంతర్ శకం

ఒకప్పుడు ఆకాశంలోని గ్రహాల గమనాన్ని, కాలాన్ని లెక్కించడానికి కట్టిన చరిత్రాత్మక కట్టడం అది. కానీ కాలక్రమేణా ప్రజల బాధలు, సమస్యలను పాలకులకు వినిపించే శక్తిమంతమైన నిరసనల వేదికగా మారిపోయింది. అదే దేశ రాజధానిలోని జంతర్ మంతర్. ప్రభుత్వంపై తమకున్న అసంతృప్తిని లేదా డిమాండ్లను దేశవ్యాప్తంగా చాటిచెప్పాలనుకునే కోట్లాది మంది ప్రజల ఆశల చిరునామా ఇది. గడిచిన కొన్ని దశాబ్దాలుగా భారత ప్రజాస్వామ్య చరిత్రలో జరిగిన ఎన్నో చరిత్రాత్మక నిరసనలకు ఈ ప్రాంగణమే సజీవ సాక్ష్యంగా నిలిచింది.

దేశవ్యాప్తంగా అవినీతికి వ్యతిరేకంగా ఒక విప్లవమే సృష్టించిన అన్నా హజారే నిరాహార దీక్షల నుంచి దేశాన్ని కుదిపేసిన నిర్భయ ఉదంతంపై యావత్ భారతావని గర్జించిన ఆందోళనల వరకు- ఇటీవల నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో విద్యార్థుల ఉద్యమాల వరకు ఎన్నో ప్రజా నిరసనలను, ప్రజాస్వామ్య గొంతుకలను ఈ వేదిక దగ్గరుండి చూసింది. అలా ఏళ్లుగా ప్రజాస్వామ్య పోరాటాలు, చారిత్రక ఉద్యమాలు, సామాన్యుల గొంతుకకు కేంద్రంగా నిలిచిన ప్రముఖ నిరసన వేదిక జంతర్ మంతర్ శకం ముగిసిపోయింది. ఢిల్లీలో శాంతియుత నిరసనల స్వరూపాన్నే పూర్తిగా మార్చేస్తూ, జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం హోదా నుంచి పూర్తిగా రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.

**అసలు జంతర్ మంతర్ నిరసన వేదికగా ఎలా మారింది?**

స్వాతంత్ర్యానంతరం దశాబ్దాల పాటు ఢిల్లీలో రాజకీయ ర్యాలీలు, నిరసనలకు ఇండియా గేట్ సమీపంలోని 'బోట్ క్లబ్' లాన్‌లే ప్రధాన వేదికలుగా ఉండేవి. పార్లమెంట్ భవనం, ప్రభుత్వ అత్యున్నత కార్యాలయాలకు అతి సమీపంలో ఉండటంతో ఇక్కడ అప్పట్లో ఆందోళనలు ఉద్ధృతంగా జరిగేవి. అయితే 1988లో రైతు నేత మహేంద్ర సింగ్ టికాయత్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో జరిగిన రైతు ఆందోళనలతో ఢిల్లీ నడిబొడ్డున ట్రాఫిక్ నిలిచిపోవడం, భద్రతా సమస్యలు తలెత్తడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. 1990ల ప్రారంభంలో రాజ్‌పథ్ (నేటి కర్తవ్యపథ్) పరిసరాల్లో నిరసనల కోసం వేసిన టెంట్లను ప్రభుత్వం తొలగించింది. ఇక్కడ కూడా నిరసనలు పూర్తిగా నిషేధించారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతుక్కున్న ఆందోళనకారులు క్రమంగా కన్నాట్ ప్లేస్ సమీపంలోని జంతర్ మంతర్ ప్రాంతంవైపు మళ్లారు. అప్పటినుంచి అంటే 1993 నాటికి ఇదే దేశ రాజధానిలో ప్రధాన నిరసన కేంద్రంగా అవతరించింది.

**ఎన్నో చారిత్రక పోరాటాలకు వేదికైన జంతర్ మంతర్**

జంతర్ మంతర్ ప్రదేశానికి సంబంధించి పెద్ద చరిత్రే ఉంది. 18వ శతాబ్దంలో ఖగోళ వస్తువులను, వింతలను, గ్రహాలు, కాల గమనాన్ని పరిశీలించడం కోసం మహారాజా సవాయ్



జైసింగ్ ×× నిర్మించిన ఈ ఎత్తైన రాతి కట్టడాల ప్రదేశమే జంతర్ మంతర్. ఈ చారిత్రక ప్రదేశం కాలక్రమేణా పాలకులపై ప్రజలకున్న వ్యతిరేకతను వ్యక్తపరిచే వేదికగా మారింది. ఇక్కడే ఎన్నో చారిత్రక ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. అవినీతి నుంచి మహిళల భద్రత వరకు, రైతుల సమస్యల నుంచి పరీక్షల నిర్వహణలో అక్రమాల ఆరోపణల వరకు ఎన్నో అంశాలపై ప్రజలు ఇక్కడే గళమెత్తారు. ఇక్కడికి వచ్చిన జనసమూహాలే కాకుండా, వారు లేవనెత్తిన సమస్యలు, అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలన్న డిమాండ్లు కూడా ఈ ప్రదేశానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఇక జంతర్ మంతర్ వేదికగా నిర్వహించిన వాటిల్లో ప్రజల దృష్టిని ఆకర్షించిన, చర్చనీయాంశంగా మారిన నిరసనలు, ఆందోళనలు, దీక్షల గురించి ఇప్పుడు చూద్దాం.

1993 జైల్ భరో ఆందోళన- జంతర్ మంతర్ వద్ద జరిగిన ముఖ్యమైన మొట్టమొదటి నిరసనల్లో 1993లో నిర్వహించిన ఈ జైల్ భరో కార్యక్రమం ఒకటి. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, మతతత్వానికి వ్యతిరేకంగా 33 సంస్థలు కలిసి సుమారు 25 వేల మందితో ఇక్కడ భారీ ఆందోళన నిర్వహించాయి. పార్లమెంటులోనూ దీని గురించి చర్చ జరిగింది.

2011 అన్నా హజారే ఉద్యమం- ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే 2011లో చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంతో జంతర్ మంతర్ పేరు మరింత మార్మోగిపోయింది. జన్‌లోక్‌పాల్ బిల్లు కోసం ఆయన చేపట్టిన 5 రోజుల నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఉద్యమమే జంతర్ మంతర్‌ను తర్వాతి రోజుల్లో జాతీయ స్థాయిలో పెద్ద పెద్ద నిరసనలకు కేరాఫ్‌గా మార్చింది. 2012 నిర్భయ ఘటన- 2012లో ఢిల్లీలో కదులుతున్న బస్సులో ఓ యువతిపై సామూహిక అత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దేశాన్ని కుదిపేసిన ఈ నిర్భయ ఘటనపై న్యాయం కోరుతూ వేలాదిగా యువతీయువకులు ఇక్కడే రోడ్డెక్కి తమ గళం వినిపించారు.

2015 ఌ=ౠ ఆందోళన- మాజీ సైనికాధికారులు వన్ ర్యాంక్ వన్ పెన్షన్ కోసం ఇక్కడ నెలల తరబడి దీక్షలు చేపట్టారు. 2017 తమిళనాడు రైతుల నిరసన- కరువు కారణంగా పంట నష్టాలకు సహాయం, రుణ మాఫీ కోసం తమిళనాడు రైతులు పుర్రెలు పట్టుకొని దాదాపు 41 రోజుల పాటు జంతర్ మంతర్ కేంద్రంగా చేసిన వినూత్న నిరసన దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది.

2019 జూౠ వ్యతిరేక ఆందోళనలు- పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2019 డిసెంబరులో ఇక్కడ వామపక్షాలు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. 2021 రైతు కిసాన్ సంసద్- రైతు ఉద్యమ చరిత్రలో జంతర్ మంతర్ వేదికగా జరిగిన కిసాన్ సంసద్ (రైతు పార్లమెంట్) ఒక వినూత్న ఘట్టంగా నిలిచింది. 2021 జులై 22 నుంచి ఆగస్ట్ 9 వరకు రోజుకు 200 మంది రైతులతో ఇక్కడ శాంతియుత నిరసనలు చేపట్టేందుకు కోర్టు, పోలీసుల అనుమతి లభించింది.

2023 రెజ్లర్ల ఆందోళన- ప్రముఖ రెజ్లర్లు, ఒలింపిక్ పతక విజేతలు సహా పలువురు క్రీడాకారులు లైంగిక వేధింపుల ఆరోపణలపై నాటి డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఇక్కడే కూర్చొని నిరసన తెలిపారు. 2026 నీట్- రాజకీయ ఆందోళనలు- నీట్ పేపర్ లీక్ ఆరోపణలతో ప్రధాన ప్రతిపక్షాలు సహా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలతో జంతర్ మంతర్ పేరు దేశవ్యాప్తంగా మరోసారి మార్మోగిపోయింది.

**జంతర్ మంతర్‌ను ఇప్పుడు ఎందుకు తొలగించాల్సి వచ్చింది?**

గతంలోనే శబ్ద కాలుష్యం, పారిశుద్ధ్య సమస్యలు, స్థానికులకు ఇబ్బందుల కారణంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చీ+ు) 2017లో ఇక్కడ నిరసనలను నిషేధించింది. దీనిపై సుప్రీంకోర్టు 2018లో చారిత్రక తీర్పునిస్తూ- శాంతియుతంగా నిరసన తెలపడం ప్రాథమిక హక్కే అయినప్పటికీ, ప్రజాభద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాలు సముచితంగా ఉండేలా ఆంక్షలు విధించొచ్చని స్పష్టం చేసింది. అయితే ఇటీవల అక్టోబర్ 10-11 తేదీల్లో జరిగిన ఉద్రిక్త ఆందోళనల నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సిఫార్సుల మేరకు ఢిల్లీ ప్రభుత్వం అక్టోబర్ 12 నుంచి జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశం హోదా నుంచి పూర్తిగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఢిల్లీలో నిరసనలకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలని సుప్రీం కోర్టు సూచించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ప్రత్యామ్నాయ వేదికలు ఇవే**

అయితే ప్రజల భావప్రకటనా స్వేచ్ఛకు, నిరసన తెలిపే ప్రాథమిక హక్కుకు భంగం కలగకుండా ప్రభుత్వం మరో 3 కొత్త ప్రదేశాలను అధికారిక నిరసన వేదికలుగా ఖరారు చేసింది. వీటిల్లో రామ్‌లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్- ఈస్ట్ ఢిల్లీ వంటివి ఉన్నాయి. అయితే దశాబ్దాలుగా సామాన్యుల గొంతుకగా మారిన జంతర్ మంతర్- ఇప్పుడు నిరసన ప్రదేశంగా దాని అధికారిక హోదా కోల్పోవడంతో, ప్రజలు తమ గొంతును వినిపించేందుకు ఉన్న వేదికల భవిష్యత్తుపై చర్చ మొదలైంది.

# కోర్టు పరిశీలనలో ఉన్న అంశాలపై సమావేశం నిర్వహించడం న్యాయ నైతికతకు విరుద్ధం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఈసీ విషయంలో కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున లేవనెత్తాలను కున్న సమస్యలపై విచారణ ఇప్పటికే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఒక విషయంపై పిటిషన్ పరిశీలనలో ఉన్నప్పుడు దాని గురించి ఇతరులతో చర్చించడం రాజ్యాంగం ప్రకారం అధికార విభజన సూత్రానికి, న్యాయపరమైన ఔచిత్యానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. సీఈసీ జ్ఞానేశ్, ఈసీ, పలువురు విద్యార్థుల అక్రమ అరెస్టులు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు వంటి అంశాలపై వినతిపత్రం సమర్పించేందుకు ఖర్గే, రాహుల్ గాంధీ కోరిన సమావేశ అభ్యర్థనను తిరస్కరిస్తూ సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై వీరిద్దరికి మెయిల్‌లో లేఖ పంపారు.

**'సుప్రీంకోర్టుకు ఆ విషయంలో ఎలాంటి అధికారాల్లేవ్'**

"న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించడం అనుచితం. అలాగే, ఆయా అంశాలపై కోర్టులో భౌతికంగా లేదా ఆన్‌లైన్ ద్వారా పిటిషన్ దాఖలు చేయాలి. ముందుగా గమనించాల్సిన విషయం ఏమిటంటే ఖర్గే, రాహుల్ పేర్కొన్న అంశాలు ఇప్పటికే భారత సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి. కాబట్టి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించడానికి సమావేశం ఏర్పాటు చేయడం అనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక స్వరూప సిద్ధాంతంలో అంతర్భాగమైన 'అధికార విభజన' సూత్రానికి పూర్తిగా విరుద్ధం అవుతుంది. అలాగే ఇది నైతిక విలువలు,




న్యాయపరమైన ఔచిత్యానికి కూడా విరుద్ధం. అంతేకాకుండా ఇండియా కూటమి నేతలు తమ లేఖలో ప్రస్తావించిన అంశాలను పరిష్కరించడానికి భారత రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టుకు ఎటువంటి పాలనాపరమైన అధికారాలు లేవు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఉన్న అధికార పరిధిని వినియోగించుకుంటూ భారత పౌరులపై ప్రభావం చూపే విషయాల్లోని ప్రధానాంశాలను పరిశీలించాల్సిన బాధ్యత మాపై ఉంది" అని ఖర్గే, రాహుల్‌కు పంపిన లేఖలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. దేశంలోని ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి సుప్రీంకోర్టు కట్టుబడి ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. చట్టపరమైన విధానాల ద్వారా ఎప్పుడైనా సరే ప్రాథమిక హక్కుల అమలును కోరే హక్కు విపక్ష నేతలకు ఉందన్నారు. ఇదే తరహా అంశాలకు సంబంధించిన కొన్ని పిటిషన్ల విచారణ మంగళవారం జరగాల్సి ఉందని తెలిపారు. సుప్రీంకోర్టులో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య స్వయంగా (భౌతికంగా) హాజరై సీఈసీ, ఈసీకి వ్యతిరేకంగా పిటిషన్‌ను దాఖలు చేయవచ్చని, లేదంటే 'ఈ- ఫైలింగ్' విధానం ద్వారా ఏ సమయంలోని పిల్ దాఖలు చేయవచ్చని చెప్పారు. అటువంటి పిటిషన్‌ను చట్టప్రకారం సాధ్యమైనంత త్వరగా విచారిస్తామని తాను హామీ ఇస్తున్నానని లేఖలో స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, భారత ఎన్నికల సంఘానికి సంబంధించిన అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించేందుకు అక్టోబర్ 12న సాయంత్రం 4- 5 గంటల మధ్య సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కలవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇండీ కూటమి నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో ఖర్గే, రాహుల్ సీజేఐకి అక్టోబర్ 10న లేఖ రాశారు. అయితే ఈ నిర్ణయాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తిరస్కరించారు. అందుకు గల కారణాలను వివరిస్తూ ఖర్గే, రాహుల్‌కు లెటర్ పంపారు.

**మోదీ సర్కార్‌పై రాహుల్ ఫైర్**

కాగా, సోమవారం కాంగ్రెస్ హెడ్ క్వార్టర్స్ వేదికగా మోదీ సర్కార్‌పై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ కాపాడుతున్నారని దుయ్యబట్టారు. నిరసనల వేళ ఢిల్లీని ఎందుకు జైలుగా మార్చారని ఎండగట్టారు. దేశ ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే మోదీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్ మరోవైపు ఉన్నారని ఆరోపించారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారని మండిపడ్డారు. ఇది మోదీ- రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదని, దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటమని చెప్పారు.

# భారత్‌లోకి చొరబడేందుకు యత్నం

జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్‌ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్-నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్‌ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు. మరోవైపు, మెంధర్ సెక్టార్‌లోని బసోని ప్రాంతంలో సరిహద్దు కంచె సమీపంలో రెండు పాత మందుపాతరలను సైన్యం గుర్తించింది. రహదారి మార్గం నిర్మాణ పనుల సమయంలో సోమవారం ఉదయం 8.25 గంటలకు ఒకటి, మధ్యాహ్నం 12.10 గంటలకు మరొకటి బయటపడ్డాయి. సైనిక నిపుణులు నియంత్రిత పేలుళ్లతో వాటిని నిర్వీర్యం చేశారు. గత వారంలోనూ ఈ ప్రాంతంలో దాదాపు 12 మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు సమాచారం. ఎల్‌ఓసీ ప్రాంతాల్లో చొరబాట్లను అడ్డుకునేందుకు మందుపాతరలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే భారీ వర్షాల కారణంగా అవి బయటపడి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో వాటిని గుర్తించడం, భద్రతను నిరంతరం పర్యవేక్షించడం సైన్యానికి సవాలుగా మారుతోంది.

## రాజ్యాంగ సంస్థలను దూషించడం దారుణం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ఇండ కూటమి నేతలు చేపట్టిన నిరసనపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, అయితే రాజ్యాంగ సంస్థలను బహిరంగంగా దూషించడం మాత్రం ఖండించదగిన విషయమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ దిశానిర్దేశం లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆ పార్టీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే బాధ్యతాయుతంగా వ్యవహరించే నాయకత్వం అవసరమని అన్నారు. సోమవారం ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో కిరణ్ రిజిజు పోస్టు చేశారు. నిరసన తెలిపే హక్కును ఎవరూ ప్రశ్నించలేరని, కానీ రాజ్యాంగ సంస్థలను దూషించడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన పనితీరును మెరుగుపరుచుకోవాలంటే ఏడాదిలో 200 రోజులు సెలవులు తీసుకోకుండా, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడు ఉండాలని వ్యాఖ్యానించారు. ఆ కామెంట్స్? లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించినవిగా భావిస్తున్నారు. రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారంటూ బీజేపీ గతంలో పలుమార్లు విమర్శలు చేసిన నేపథ్యంలో రిజిజు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఇండీ కూటమి నేతల ర్యాలీ**

మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ౠ×=) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు ఆందోళన కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో ఇండీ కూటమి నేతలు సోమవారం సుప్రీంకోర్టు వైపు ర్యాలీ చేపట్టారు. ఎన్నికల సంఘం తీరును ప్రశ్నిస్తూ, ఓటు చోరీ ఆరోపణలపై న్యాయపోరాటం చేయాలనే ఉద్దేశంతో ఆ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ ర్యాలీలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ సహా ఇతర ఇండీ కూటమి నాయకులు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. అఖిల భారత విద్యార్థి సంఘం (ూ×ూౠ) అధ్యక్షురాలు నేహా బోరా సైతం రాహుల్, ప్రియాంకలతో కలిసి నడిచారు. ఆ ర్యాలీకి 'ప్రజాస్వామ్యం కోసం మార్చ్' అని పేరు పెట్టారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించకూడదని విపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు.

**సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు**

ఇక జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు, ఓట్ల చోరీ అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు.

**ఢిల్లీ వీధుల్లో భారీగా పోలీసు బందోబస్తు**

ఇండీ కూటమి నేతల ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ర్యాలీ మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. రాజకీయ కార్యకర్తలు, పౌర హక్కుల సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ మాట్లాడుతూ, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఢిల్లీకి వచ్చారని తెలిపారు. ఎస్?ఐఆర్? ప్రక్రియను, ఓటు చోరీ ఆరోపణలను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. హరియాణా, అసోం, బిహార్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలు, ఎన్నికల నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు పంజాబ్‌లోనూ అదే విధంగా జరిగే అవకాశం ఉందని తమ పార్టీ ఆందోళన చెందుతోందని అన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా చూడాలనే ఉద్దేశంతోనే ప్రజలు వీధుల్లోకి వచ్చారని వివరించారు.

## ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..

దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్-2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు. ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137